ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పల్నాడు జిల్లా వార్తలు

5

గురువారం 4 జనవరి 2024



● నరసరావుపేట: కలెక్టరేట్ వద్ద నినాదాలు చేస్తున్న అంగన్‌వాడీలు



గుంటూరులో కలెక్టరేట్ ముట్టడిలో సొమ్మసిల్లి పడిపోయిన అంగన్‌వాడీ కార్యకర్త

నిరసనాగ్రహం



డిమాండ్ల పరిష్కారం కోసం చేపట్టిన ఆందోళనలు ఉధృతమవుతున్నాయి. మూడు వారాల నుంచి సమ్మె చేస్తున్న అంగన్ వాడీ లు బుధవారం కలెక్టరేట్ల ముట్టడికి పిలుపిచ్చారు. పోలీసులు అడుగడుగునా ఆంక్షలు విధించినా అంగన్‌వాడీలు కలెక్టరేట్ల ముట్టడి ని జయప్రదం చేశారు. జిల్లాలోని అన్ని మండలాల నుంచి అంగన్ వాడీలు జిల్లా కేంద్రాలకు చేరుకోవడంతో రహదారులన్నీ ఆందోళన కారులతో నిండిపోయాయి. వందల సంఖ్యలో పోలీసులతో కలెక్టరేట్ల దగ్గర పహారా పెట్టి భయానక వాతావరణాన్ని ప్రభుత్వం సృష్టించినా అంగన్‌వాడీలు తగ్గలేదు. ప్రభుత్వ వ్యతిరేక నినాదాలతో కలెక్టరేట్ ప్రాంతాలు హోరెత్తాయి. పారిశుధ్య కార్మికులు, ఉపాధ్యాయులు, సమగ్ర శిక్ష ఉద్యోగులు, మున్సిపల్ ఉద్యోగులు ఎక్కడికక్కడ ఆందోళనలను కొనసాగించారు.



కార్యకర్తలను స్టేషన్‌కు తరలిస్తున్న పోలీసులు

- ఆందోళనలతో అట్టుడికిన బాపట్ల
- కలెక్టరేట్‌ను ముట్టడించిన అంగన్‌వాడీలు
- ఆర్డీవో కార్యాలయంలో సమగ్ర శిక్ష ఉద్యోగుల ధర్నా
- యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల 12 గంటల ధర్నా
- ఎక్కడికక్కడ మున్సిపల్ కార్మికుల సమ్మె, ప్రదర్శనలు

నరసరావుపేట, జనవరి 3 : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ ఉద్యోగులు, కార్మికులు, ఉపాధ్యాయులు బుధవారం పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం నిర్ల క్ష్యంగా వ్యవహరిస్తోందంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు భారీ ప్రద ర్శనలు నిర్వహించారు. కలెక్టరేట్, మునిసిపల్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం, ధర్నా చౌక్ వద్ద ఆందోళనలు చేశారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని తీవ్రంగా ఖండించారు. తమ డిమాండ్లను నెరవేర్చేదాకా ఆందోళనలు విరమించేది లేదని స్పష్టం చేశారు. ఆయా వర్గాల ఆం దోళనలతో జిల్లా కేంద్రం నరసరావుపేట దద్దరిల్లింది. అంగన్‌వాడీలు, సమగ్ర శిక్షా ఉద్యోగులు, మునిసిపల్ కార్మికులు, ఉపాధ్యాయులు ఆందోళనలతో హోరెత్తించారు.

ప్రభుత్వాన్ని గద్దె దింపుతాం

అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడి

తమ న్యాయమైన సమస్యలు పరిష్కరించాలని కోరుతున్నా ప్రభుత్వం ఏమాత్రం పట్టించు కోవడంలేదని.. ప్రభుత్వాన్ని గద్దె దింపుతామని అంగన్ వాడీలు హెచ్చరించారు. ప్రభుత్వం మొండిగా వ్యవహరిస్తోందని అంగన్ వాడీలపై బెదిరింపు చర్యలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ ప్రభుత్వం అంగన్‌వాడీల ఆగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. నిరవధిక సమ్మెలో భాగంగా 23 రోజైన బుధవారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. కలెక్టరేట్‌లోకి ప్రవేశించే ప్రధాన ద్వారం వద్ద రహదారిపై బైఠాయించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, అయాలు వందలాదిగా తరలివచ్చారు. హామీల అమలుపై ప్రభుత్వం మొండి వైఖరి వీడాలని పెద్ద ఎత్తున చేసిన నినాదాలతో కలెక్టరేట్ దద్దరిల్లింది. విధుల్లో చేరకపోతే తొలగిస్తామని బెదిరింపులకు పాల్ప డితే బెదిరిపోమని అంగన్‌వాడీలు స్పష్టం చేశారు. తమను తొల గించాలనుకుంటే చూస్తూ ఊరుకునేది లేదని ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెబుతామని ప్రకటించారు. వైసీపీని శాశ్వతంగా ఇంటికి పంపించే విధంగా వచ్చే ఎన్నికలను ఉపయోగించుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వంతో అమీతుమీ తేల్చుకుంటామని హెచ్చ రించారు. కొందరు ప్రతినిధులను కలెక్టరేట్‌లోని అనుమతించడంతో వారి డీఆర్‌వో వినాయకంకు వినతిపత్రం సమర్పించారు. సీఐటీయూ, ఏఐటీయూసీ, వివిధ సంఘాల నేతలు పాల్గొన్నారు.

ఒకటిన జీతాలివ్వండి



గాంధీ పార్క్ వద్ద యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల ధర్నా

- ఉపాధ్యాయుల ధర్నా

నరసరావుపేటలో యూటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు ధర్నా చేశారు. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు ధర్నా నిర్వహించారు. ప్రతి నెల ఒకటన జీతాలు చెల్లించాలని, పీఆర్‌సీ, డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్‌ఐ బకాయిలను వెంటనే చెల్లించాలని నినదించారు. యుటీఎఫ్ పోరుబాటలో బాగంగా చేపట్టిన అందోళనలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ప్రతి నెల 17వ తేదీ వరకు జీతాల కోసం ఎదురు చూడాల్సి వస్తుందని అందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం 11,462 కోట్లు బకాయిలు చెల్లించాల్సి ఉందని ఫెడరేషన్ నేతలు తెలిపారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ధర్నాను ప్రారంభించారు. ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని లక్ష్మణరావు కోరారు.

మునిసిపల్ కార్మికుల ధర్నా.. టెంట్ ధ్వంసం

మునిసిపల్ కార్యాలయం వద్ద కార్మికులు ఏర్పాటు చేసుకున్న ధర్నా శిబిరాన్ని గుర్తుతెలియని వ్యక్తులు మంగళవారం రాత్రి ధ్వంసం చేశారు. ఆగంతకులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ కార్మికులు మంగళవారం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అనుచరులే టెంట్‌ను ధ్వంసం చేసి ఉంటారన్న అనుమానాలను వారు వ్యక్తం చేశారు. ఈ చర్యలను తీవ్రంగా ఖండిస్తూ కార్మికులు పట్టణంలో నిరసన ప్రదర్శన నిర్వహించారు. సమ్మె బుధవారానికి తొమ్మిదో రోజుకు చేరింది. జిల్లాలోని మునిసిపాల్టీలలో వందలాది మంది కార్మికులు నిరవధిక సమ్మెలో ఉన్నారు. వివిధ రూపాలలో నిరసనలు తెలియజేస్తున్నారు. మునిసిపల్ కార్యాలయాల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు నిర్వహించారు. హామీలను అమలు చేయకుండా కార్మికులను ... దారుణంగా ప్రభుత్వం మోసగించిందని కార్మికులు మండి పడుతున్నారు. డిమాండ్‌లు సాధించే వరకు సమ్మె వీడేదీ లేదని తేల్చిచెబుతున్నారు. కాగా నరసరావుపేట పట్టణంలో మునిసిపాలిటీ ప్రైవేట్ వర్కర్లతో పారిశుధ్య పనులను పోలీసుల పహారాలో నిర్వహించింది. ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి చీపురు పట్టి రోడ్డు ఊడ్చారు.



ధ్వంసం చేసిన కార్మికుల సమ్మె శిబిరం టెంట్



నరసరావుపేటలో మున్సిపల్ కార్మికుల నిరసన ప్రదర్శన

ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా

విద్యా వ్యవస్థలో అత్యంత కీలక పాత్ర పోషి స్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని సమగ్ర శిక్షా కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జేఏసీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరవధిక సమ్మె 15వ రోజు బుధవారం కొనసాగింది. నరసరావుపేటలోని ధర్నా చౌక్‌లో ధర్నా నిర్వహించారు. శిబిరం నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ప్రదర్శన చేశారు. ఆర్డీవో కార్యాలయంలో ఆందోళన చేపట్టారు. అనంతరం ఆర్డీవో శేషిరెడ్డికి వినతి పత్రం అందించారు. తమ సమస్యల పరిష్కారంపై ప్రభుత్వం స్పందించాలని నినదించారు. సమ్మెబాట పట్టడంతో విద్యా కార్యక్రమాలు ఎక్కడికక్కడే స్తంభించాయి. ప్రభుత్వం వివక్ష చూపటం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించే వరకు నిరవధిక సమ్మె కొనసాగిస్తామని హెచ్చరించారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు ధర్నా శిబిరాన్ని సందర్శించి ఉద్యోగులకు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఉద్యోగుల న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని లక్ష్మణరావు కోరారు.



సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల ధర్నాను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు



చిలకలూరిపేటలో మునిసిపల్ కార్మికుల భారీ ర్యాలీ



రోడ్డుకు అడ్డంగా పెట్టిన వాహనాలు

సీసీఐలో మిల్లర్ల చేతివాటం

- తడిసిందన్న సాకుతో కోతపై రైతుల కన్నెర్ర
- క్వింటాకు 10 కేజీల మినహాయింపుపై ఆగ్రహం
- గుంటూరు-పర్చూరు రహదారిపై రైతుల రాస్తారోకో

గుంటూరు సిటీ, జనవరి 3: వర్షానికి పత్తి తడిసింది.. క్వింటాకు 10 కేజీలు చొప్పున తరుగు కింద మినహాయిస్తాం.. అని సీసీఐ పత్తి కొనుగోళ్లలో మిల్లర్ల చేతివాటంపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కొన్నిచోట్ల మిల్లర్లే బయ్యర్ల పాత్ర పోషిస్తుండటం వివాదాస్పదంగా మారింది. గుంటూరు 5 మైలు సమీపంలోని సీసీఐ కేంద్రం వద్ద బుధవారం రైతులు ఆందోళనకు దిగారు. తాడికొండ మండలం పొన్నెకల్లుకు చెందిన రైతులు బుధవారం పత్తిని తీసుకుని కేంద్రానికి వచ్చారు. అయితే సాయంత్రం వరకు బతిమిలాడినా పత్తి కొనుగోలుకు అక్కడున్న వారు ససేమిరా అన్నారు. బయ్యర్ తరఫున వచ్చిన వాళ్లు కొనుగోలు చేయమని చేతులు ఎత్తేశారు. దీంతో మిల్లర్ రంగంలోకి దిగి క్వింటాకు 10 కేజీల చొప్పున తగ్గించి కొనుగోలు చేస్తామని చెప్పగా రైతులు అంగీకరించలేదు. అవసరమైతే ధరలో రూ.100 తగ్గించమని చెప్పారు. తాము చెప్పినదానికి అంగీకరించనందున పత్తిని కొనుగోలు చేయమని మిల్లర్లు చెప్పడంతో వివాదం నెలకొంది. పత్తిని కొను గోలు చేయాల్సిందేనని డిమాండ్ చేస్తూ రైతులు గుంటూరు-పర్చూరు రోడ్డుపై రాస్తారోకోకు దిగారు. వాహనాలను రోడ్డుకు అడ్డంగా పెట్టి ధర్నా చేయడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులకు, ప్రయాణికులకు మధ్య కొంత వాగ్వాదం జరిగింది. 108 అంబులెన్స్ రావడంతో రైతులు రాస్తారోకో విరమించారు.

అన్ని చోట్ల అంతే

గతేడాది నవంబరు నుంచే సీసీఐ పత్తి కొనుగోలుకు కేంద్రాలను తెరిచింది. గుంటూరులో తాడికొండ, ఫైలవరం, జగ్గయ్యపేట, ప్రత్తిపాడు కేంద్రాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఈ కేంద్రాలకు ఉమ్మడి గుంటూరు జిల్లా నుంచి అధిక మొత్తంలో పత్తిని తీసుకు వచ్చారు. కొన్ని చోట్ల కొను గోలు బాగా జరుగుతున్నా, మరికొన్ని చోట్ల మాత్రం ప్రైవేటు వ్యక్తుల జోక్యంతో వివాదాస్పదమవుతుంది. మొదట్లో కొన్ని కేంద్రాల్లో క్వింటాకు 3 కేజీల వరకు తరుగు తీసినట్లు ఆరోపణ లు వచ్చాయి. అప్పట్లో సీసీ ఐ అధికారులు అప్రమత్తం కావడంతో రైతులకు కొంత మేలు జరిగింది. తుపాను తర్వాత పత్తి కొనుగోళ్లలో పూర్తిగా ప్రైవేటు వ్యక్తుల జోక్యం పెరిగి నాణ్యత లేదన్న సాకుతో క్వింటాకు 10 కేజీల వరకు తరుగు తీస్తున్నారు. తరుగుకు రైతు ఒప్పుకోక పోతే పంటను కొనుగోలు చేయడం లేదు. చాలామంది రైతులు ఏమీ చేయలేక ఎంతో కొంతకి అమ్ముకునిపోయారు. ప్రత్తిపాడు కేంద్రంలో క్వింటాకు రూ.150 నుంచి రూ.200 వరకు ప్రైవేటు వ్యక్తులకు ఇవ్వాల్సి వస్తుందని రైతులు ఆరోపిస్తున్నారు. తుఫాను తర్వాత సీసీఐ కనీస మద్దతు ధరను రూ.7020 నుంచి రూ.6670కి తగ్గించింది. ఈ ధరకు విక్రయించేందుకు సిద్ధమైనా మరింత కోతలు పెట్టడంపై రైతులు మండిపడుతున్నారు. కొన్ని కేంద్రాల్లో రైతుల కన్నా ఎక్కువగా వ్యాపారులే అమ్మకాలకు వస్తున్నారు. ఈ-క్రాప్ నిబంధన ఉన్నా సచివాలయంలో వ్యవసాయ శాఖ అసిస్టెంట్లను మచ్చిక చేసుకుని పేర్లు నమోదు చేయిస్తున్నారని ఆరోపణలున్నాయి.

మిగిలేది ఏమీ లేదు..



ఆరుగాలం పండించి తెచ్చిన పంటను కొనడానికి నానా ఇబ్బందులు పెడుతున్నారు. నేను 10 ఎకరాల్లో పత్తి వేశా. ఇక్కడకు వచ్చాక క్వింటాకు 10 కేజీల తరు గంటే మాకు మిగిలేది ఏమీ ఉండదు.

- ముప్పాళ్ళ సాంబశివరావు, పొన్నెకల్లు

క్వింటాకు రూ.2 వేలు ఖర్చు



పత్తి తీయడానికి క్వింటాకు రూ.2 వేలు ఖర్చు అవుతుంది. తుఫాను వల్ల నష్టపోయాం. ఇప్పుడు పత్తి కొనుగోలుకు నానా ఇబ్బందులు పెడుతున్నారు. రైతులను దోచుకుంటున్నారు.

- అన్నే నాగేశ్వరరావు, పొన్నెకల్లు

మందు.. కాసుల విందు

- తెలంగాణ మద్యానికి డిమాండ్
- సొమ్ము చేసుకుంటున్న వైసీపీ నేతలు
- మామూళ్ల మత్తులో చెక్‌పోస్టుల అధికారులు
- సరిహద్దుల వద్ద విధులకు పోటీపడుతున్న వైనం
- డబ్బు కోసం దందాలు చేసిన వారు ఇప్పుడు మద్యం బాట

పిడుగురాళ్ల, జనవరి 3: ఆంధ్ర మద్యం వద్దు.. తెలంగాణ మద్యం కావాలి.. మందుబాబుల డిమాండ్‌ను వైసీపీ నేతలు సొమ్ము చేసుకుంటున్నారు. తెలంగాణ సరిహద్దు ప్రాంతాల్లోని వైసీపీ నేతలు మద్యం కాసులతో పండిపోతున్నారు. అడ్డదారిలో తెచ్చిన మద్యాన్ని అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. చెక్ పోస్టులు ఉన్నా నేతలు వేసిన మేతకు అధికారులు నోరు మెద పడంలేదు. ఒకప్పుడు డబ్బు కోసం దందాలు చేసిన నాయకులు ఇప్పుడు మద్యం బాట పట్టారు. పల్నాడు ప్రాంతంలో ఇప్పుడు తెలంగాణ మద్యం వ్యాపారం మూడు పువ్వులు.. ఆరు కాయలుగా బాసిల్లుతుంది. పల్నాడుకు సమీపంలోని తంగెడ, పొందుగల సరిహద్దుల వద్ద విధులు నిర్వహించేందుకు కొందరు అధికారులు కప్పం కట్టి మరీ డ్యూటీలు వేయించుకుంటున్నారంటే అక్కడ ఏ స్థాయిలో ఆదాయం ఉందో అర్థం చేసుకోవచ్చు. మేము ఫలానా రోజున అక్కడ విధుల్లో ఉంటామని చెప్పి- ఆ రోజు ఎంతైనా మద్యం తెచ్చుకోండి.. మాకెంతో చెప్పండంటూ కొందరు అధికారు లు ముందుగానే ఒప్పందం కుదుర్చుకుంటున్నారు. నేతలు కూడా ఆ అధికారులు విధుల్లో ఉన్న రోజుల్లోనే యథేచ్ఛగా తెలంగాణ మద్యాన్ని సరిహద్దులు దాటించి తెచ్చుకుంటున్నారన్న ఆరోపణలు న్నాయి. తమ వాహన నెంబర్లను సరిహద్దుల వద్ద విధుల్లో ఉన్న అధికారులకు సమాచారం ఇస్తుండగా ఆ సమయంలో మొక్కు బడి తనిఖీలతో సరిపెడుతున్నారు. నూతన సంవత్సర వేడుకలకు కొద్దిరోజులు ముందుగానే ఒక్కో వాహనంలో వందలాది మద్యం బాటిల్స్ రవాణా జరిపారనే ఆరోపణలున్నాయి. రెండు రోజుల క్రితం తెలంగాణ మద్యాన్ని సర ఫ రా చేస్తున్న వారిలో ఓ పోలీసు అధికారితో పాటు ఓ పార్టీకి చెందిన ఇద్దరు కూడా ఉండటం విశేషం.

డోర్‌డెలివరీ.. ఆఫర్లు

సంక్రాంతి పండుగకు మద్యం అవసరాన్ని గుర్తించిన కొందరు నేతలు గుట్టుగా తెలంగాణ మద్యాన్ని పల్నాడుకు సరఫరా చేయించి గ్రామాలకు, పట్టణాలలోని పలు ప్రాంతాలకు తరలించి తమ అనుయాయుల ద్వారా విచ్చలవిడిగా డోర్ డెలివరీ చేసేలా ఏర్పాట్లు చేస్తున్నారు. మందు కావాలంటే ఫోన్ చేయాలని నెంబర్లు ఇస్తున్నారు. ఫోన్‌చేసిన వ్యక్తులు చెప్పిన బ్రాండ్లను సరఫరా చేసేందుకు కొంతమంది యువకులు పల్నాడులో పనిచేస్తున్నారు. పల్నాడు ప్రాంతంలో ఏ ఊరి గల్లీలోనైనా తెలంగాణ మద్యం దొరుకుతుంది. తెలంగాణ మద్యం అమ్మాలంటే నేతల అండదండలు తప్పనిసరి. తమ మనుషులు కాకుండా ఇతరులు ఎవరైనా మద్యాన్ని సరిహద్దులు దాటిస్తున్నా, విక్రయిస్తున్నా ఆ వెంటనే సెబ్ అధికారులకు సమాచారం వెళ్తుంది. సెబ్ అధికారులు వారిపై దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకుంటున్నారు. నేతల అండతో సెబ్ కార్యాలయాలకు కూతవేటు దూరంలో విచ్చలవిడిగా తెలంగాణ మద్యాన్ని విక్రయిస్తున్నా అధికారులు పట్టించుకోవడంలేదన్న విమర్శలున్నాయి. కరాలపాడుతో పాటు మరికొన్ని గ్రామాలలో క్వార్టర్‌కు కోడిగుడ్డు ఫ్రీ అంటూ ఆఫర్లు పెట్టిమరీ తెలంగాణ మద్యం విక్రయిస్తున్నారు.



పొందుగల, తంగెడ వద్ద ఆంధ్రా - తెలంగాణ సరిహద్దు ప్రాంతంలోని చెక్ పోస్టులు





ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ, లైన్‌మెన్

- 45 వేలు లంచం తీసుకుంటూ పట్టుబడిన వైనం

స్వప్రయోజనాల కోసమే మూడు రాజధానులు

- రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న వైసీపీ ప్రభుత్వం
- 1478వ రోజుకు అమరావతి రైతుల ఆందోళనలు

7లో..

దిక్సూచి DIKSUCHI

ఇఫ్లూలో ఇంగ్లీష్ ప్రొఫిషియెన్సీ కోర్సు

హైదరాబాద్‌లోని ఇంగ్లీష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ (ఇఫ్లూ-సెంట్రల్ యూనివర్సిటీ)కి చెందిన నాన్ ఫార్మల్ కోర్సెస్ అండ్ రిసోర్సెస్(ఎన్ఎఫ్‌సీఆర్) విభాగం- ప్రొఫిషియెన్సీ కోర్స్ ఇన్ ఇంగ్లీష్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది.

కోర్సు వ్యవధి 40 గంటలు. ఇందులో ప్రధానంగా ఇంగ్లీష్‌కు సంబంధించి రిటెన్, స్పోకెన్ స్కిల్స్ నేర్పిస్తారు. ఫిబ్రవరి 5 నుంచి మార్చి 1 వరకు నాలుగు వారాలు శిక్షణ తరగతులు నిర్వహిస్తారు. రోజుకు రెండు గంటలు చొప్పున వారానికి అయిదు రోజులు తరగతులు ఉంటాయి. మొత్తం 200 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కం ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అడ్మిషన్స్ ఇస్తారు. ఇంగ్లీష్ లాంగ్వేజ్‌కు సంబంధించి లిజనింగ్, స్పీకింగ్, రీడింగ్, రైటింగ్ వంటి కమ్యూనికేషన్ స్కిల్స్ నేర్పిస్తారు. మొదటి వారంలో ఇంట్రడక్షన్స్, డిస్క్రిప్షన్, నరేషన్, ప్లానింగ్; రెండో వారంలో ఎక్స్‌ప్లయినింగ్, ఇన్‌ఫార్మింగ్, ఇన్‌స్ట్రక్టింగ్/డైరెక్టింగ్, రెస్పాండింగ్; మూడో వారంలో ఎక్స్‌ప్రెసింగ్ ఒపీనియన్, గ్రూప్ డిస్కషన్, నోట్ టేకింగ్, సమ్మ రైజింగ్, ఫార్మల్ లెటర్ రైటింగ్; నాలుగో వారంలో సీవీ అండ్ అప్లికేషన్, లెటర్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, అఫీషియల్ రైటింగ్ తరగతులు ఉంటాయి. కోర్సుకు సంబంధించిన మెటీరియల్ ఇస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన కాలేజీ నుంచి ఇంటర్/పన్నెండో తరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులై ఉండాలి. విదేశీ విద్యార్థులు కూడా అప్లయ్ చేసుకోవచ్చు.

- **కోర్సు ఫీజు:** భారతీయ విద్యార్థులకు రూ.2,500; విదేశీ విద్యార్థులకు రూ.5,000; ఇఫ్లూలో చదువుతున్న విదేశీ విద్యార్థులకు రూ.4,000
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- దరఖాస్తు ఫారాలను జనవరి 19 వరకు ఇస్తారు.
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** జనవరి 31
- **ఫోన్ నెం.** 040 27689646
- **వెబ్‌సైట్:** efluniversity.ac.in

ఐఐఎం కాశీపూర్‌లో ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్)

కాశీపూర్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్(ఐఐఎం)- వర్కింగ్ ప్రొఫెషనల్స్ కోసం ఉద్దేశించిన ఎగ్జిక్యూటివ్ ఎంబీఏ(అనలిటిక్స్) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి రెండేళ్లు. ఆరు టర్మ్‌లు ఉంటాయి. వ్యాపారవేత్తలు, ఆంత్రప్రెన్యూర్స్, ఇంజనీర్లు, నాన్ ఇంజనీర్లు, మిడ్ లెవెల్ ఎగ్జిక్యూటివ్‌లు అప్లయ్ చేసుకోవచ్చు. అడ్మిషన్ టెస్ట్, పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు.

ఇది ఆన్‌లైన్ బ్లెండెడ్ లెర్నింగ్ ప్రోగ్రామ్ అయినప్పటికీ కొన్ని ఆన్ క్యాంపస్ తరగతులు కూడా నిర్వహిస్తారు. ప్రోగ్రామ్‌లో భాగంగా ఫ్యాకల్టీ వర్చువల్ మీటింగ్స్, అసైన్‌మెంట్లు, క్విజ్‌లు, పెడగాగి క్లాసెస్, సిమ్యులేషన్స్, ఇండస్ట్రీ వర్క్‌షాప్స్, క్యాప్‌స్టోన్ ప్రాజెక్టులు, ఇతర ప్రాజెక్ట్ వర్క్‌లు, టర్మ్ ఎండ్ ఎగ్జామ్స్ ఉంటాయి. ప్రోగ్రామ్ మొత్తానికి 34.5 క్రెడిట్లు నిర్దేశించారు.



అర్హత

గుర్తింపు పొందిన కళాశాల నుంచి కనీసం 45 శాతం మార్కులతో ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి.

దరఖాస్తు ఫీజు: రూ.2,950

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: జనవరి 6

వెబ్‌సైట్: iimkashipur.ac.in

ఎంఎస్ఈలో పీజీ డిప్లొమా

మద్రాస్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ (ఎంఎస్ఈ) ఆధ్వర్యంలోని బిజినెస్ స్కూల్ - పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ మేనేజ్‌మెంట్ (పీజీడీఎం) ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఇది ఫుల్ టైం ప్రోగ్రామ్. దీని వ్యవధి రెండేళ్లు. ఫైనాన్స్, రీసెర్చ్ అండ్ బిజినెస్ అనలిటిక్స్ స్పెషలైజేషన్‌లు ఉన్నాయి. జాతీయ పరీక్ష స్కోర్, అనుభవం, పర్సనల్ ఇంటర్వ్యూ ద్వారా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

అర్హత: గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి నుంచి డిగ్రీ స్థాయి వరకు కనీసం 70 శాతం మార్కులు ఉండాలి. ఇంటర్ స్థాయిలో మేథమెటిక్స్ చదివిన అభ్యర్థులకు ప్రథమ ప్రాధాన్యం ఉంటుంది. క్యాట్/జీమ్యాట్/ఎక్స్ఏటీ/మ్యాట్/సీమ్యాట్/ఏటీఎంఏ వ్యాలిడ్ స్కోర్ ఉండాలి.

- **దరఖాస్తు ఫీజు:** రూ.1500
- **దరఖాస్తు సబ్మిషన్‌కు చివరి తేదీ:** రౌండ్ 1కు ఫిబ్రవరి 19; రౌండ్ 2కు మే 6; రౌండ్ 3కి జూలై 1
- **ఇండక్షన్ ప్రోగ్రామ్:** జూలై 12
- **ప్రోగ్రామ్ ప్రారంభం:** ఆగస్టు 1 నుంచి
- **వెబ్‌సైట్:** www.mse.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/KXuANaqలో చదవండి.

జేఈఈ మెయిన్ ప్రిపరేషన్ టిప్స్

ప్రతిష్ఠాత్మక ఇంజనీరింగ్ కాలేజీల్లో ప్రవేశానికి ఉద్దేశించిన తొలి వడపోతఅయిన జేఈఈ మెయిన్ మొదటి సెషన్ మరో ఇరవై రోజుల్లో ఆరంభం కానుంది. ఇంటర్ లేదంటే పన్నెండో తరగతి ఎగ్జామ్స్‌కు ముందే జరిగే ప్రవేశ పరీక్ష ఇది. ఒకరకంగా ఎంట్రెన్స్ అంటే భయం, బెరుకు ఏదైనా ఉంటే దీంతో అవి పోగొట్టుకోవచ్చు. ఇది చక్కగా రాస్తే, మంచి స్కోర్ సాధించగలిగితే ఇంటర్ పరీక్షలు తరవాత సెలవులు ఎంజాయ్ చేయవచ్చు. అలాగే ఐఐటీలో చేరేందుకు ఉద్దేశించిన జేఈఈ అడ్వాన్స్‌డ్‌పై గురిపెట్టవచ్చు. ఈ నేపథ్యంలో ఉన్న ఈ కొద్ది రోజులను సద్వినియోగం చేసుకునేందుకు నిపుణులు సూచించిన కొన్ని టిప్స్



- నేర్చుకున్నది చాలు, ఈ కొద్ది రోజులు రివిజన్‌కు సమయాన్ని ఉపయోగించాలి. ముఖ్యమైన ఫార్ములాలు, థీరమ్స్, రియాక్షన్స్ వంటివి ప్రాక్టీస్ చేయాలి. ప్రాబ్లెమ్స్ సాల్వ్ చేసేందుకు ఇవన్నీ తోడ్పడతాయి. బలంగా ఉన్న వాటిపైనే మరింత శ్రద్ధవహించాల్సిన సమయం ఇది. వచ్చిన వాటినే మరిన్ని సార్లు చదవడం లేదంటే ప్రాక్టీస్ చేయడంతో మైండ్‌లో ఆ టాపిక్ స్థిరపడుతుంది. పరీక్షలో మరింత బాగా ఆన్సర్ చేసేందుకు ఉపయోగపడుతుంది.
- రివిజన్ కోసం షార్ట్ నోట్స్‌ని ఉపయోగించుకోవాలి. అందులో ఫార్ములాలు, కాన్సెప్ట్ ఉండేలా చూసుకోవాలి. టాపిక్స్‌లోకి వెళ్ళి, ఇవన్నీ ఎక్కడ ఉన్నాయన్నది సరిచూసుకోవడం కష్టం. అలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఇది మంచి మార్గం. అలాగే ఫ్లాష్ కార్డులతోనూ ప్రయోజనం ఉంటుంది.
- సబ్జెక్టు లేదంటే ప్రత్యేకించి టాపిక్‌పరంగా ఏవైనా సందేహాలు ఉంటే వాటిని వెంటనే నివృత్తి చేసుకోవాలి. టీచర్ నుంచి సీనియర్ వరకు ఈ విషయంలో ఎవరితో అయినా మాట్లాడవచ్చు. సందేహం తీరడం ముఖ్యం. కాన్సెప్టులను క్షుణ్ణం గా అర్థం చేసుకోవడం కూడా కీలకం.
- సాధ్యమైనన్ని మాక్ టెస్టులు రాయాలి. ఆలిండియా స్థాయిలోవి రాస్తే మంచిది. ఇవి రాస్తే అసలు పరీక్షను ఎదుర్కోవడం సులువు అవుతుంది. ఒకటి రెండు మాక్ టెస్టులు రాసి, పాత పేపర్లను సాల్వ్ చేయడం మరో పద్ధతి. అయితే అది అంత ప్రాక్టికల్‌గా అనిపించదు. దానికి బదులు రోజుకో టెస్ట్ రాసి విశ్లేషించుకోవడం చాలా మంచిది. ఎక్కడ తప్పు చేశామో గుర్తించి, దాన్ని తిరిగి నేర్చుకుంటే కలకాలం గుర్తుంటుంది. అసలు పరీక్షలో సరిగ్గా అదే సమస్యవస్తే సులువుగా గుర్తుకొస్తుంది. అందుకే ఆలిండియా స్థాయిలో జరిగే మాక్‌టెస్టులను ఎంచుకోవాలని విజ్ఞులు చెబుతూ ఉంటారు.
- అర్ధరాత్రి వరకు చదవడానికి ఎక్కువ మంది విద్యార్థులు ఆసక్తి చూపుతారు. అయితే అంత సీన్ అవసరం లేదు. రాంగ్ ప్రాక్టీస్ కూడా. పరీక్షలు ముంచుకొస్తున్న ఈ సమయంలో సరిపోను విశ్రాంతి, నిద్ర ఆరోగ్యకరమైన ఆహారం చాలా అవసరం.
- పాజిటివ్ మైండ్‌సెట్‌ను డెవలప్ చేసుకోవాలి. అర్జునుడికి పక్షి కన్నుపై గురి మాదిరిగా రాసే పరీక్షలో సక్సెస్ లక్ష్యం కావాలి. ఒత్తిడి(స్ట్రెస్) అనిపిస్తే వెంటనే మరో ఫన్నీ యాక్టివిటీతో మైండ్‌ను ఫ్రెష్ చేసుకోవాలి. కొద్దిసేపు ఇష్టమైన వాటిపై దృష్టిపెడితే చాలు, ఒత్తిడి చాలావరకు తగ్గుతుంది.
- కాన్సంట్రేషన్ లెవెల్స్ పెంచుకోవడం అన్నది కీలకమే. అందుకే గంటల కొద్దీ చదవకూడదని అంటారు. రెగ్యులర్ బ్రేక్స్ అలాగే ఆ సమయంలో యోగా తదితర కార్యకలాపాలతో మైండ్‌ని ఫ్రెష్‌గా ఉంచుకోవాలి. అదేవిధంగా ప్రిపరేషన్‌పై ఎవరితోనూ చర్చించాల్సిన అవసరం లేదు. పరీక్షకు ప్రిపేర్ కావడం అన్నది వ్యక్తిగతం. అది ఎలా ఉండాలన్నది మనమే నిర్ణయించుకోవాలి.

పరీక్ష హాలులో

- జేఈఈ మెయిన్ ప్రశ్నలను చూసుకునేందుకు మొదట కొద్ది సమయాన్ని ఉపయోగించుకోవాలి. ఆ సమయంలో అస్సలు ఆందోళన చెందవద్దు. ఏవీ తెలియనట్టు అనిపించినా బెదరవద్దు. గట్టిగా శ్వాస తీసుకుని వదలండి.
- ఎప్పుడైన కొన్ని ప్రశ్నలు కష్టంగా ఉంటాయి. సులువైన ప్రశ్న కనిపించే వరకు ముందుకు కదలండి. ఎక్కడో ఒక చోట ఈజీ ప్రశ్న తగులుతుంది. మొదట దాన్ని సాల్వ్ చేయండి. కాన్ఫిడెన్స్ లెవెల్ పెరుగుతుంది. తరవాత మరొకటి సులువైనది తీసుకోండి. అప్పటికి మీరు కుదురుకుంటారు. ఆ తరవాత ఎదురుండదు. వచ్చినవన్నీ సాల్వ్ చేసుకుంటూ వెళ్ళడమే పనిగా ఉండాలి.
- ఒక మాట వినే ఉంటారు. కష్టం మీ ఒక్కరికే సొంతం కాదు. అలాంటి వాళ్ళే చాలామంది ఉంటారు. వారిలో మీరు ఒకరు అంతే.
- ప్రశ్న ఏదైనా సాల్వ్ చేసేందుకు కొంత సమయం పెట్టుకోవాలి. రాకుంటే తరవాతి ప్రశ్న చూడాలి. అంతే తప్ప ఒక్క ప్రశ్న దగ్గరే ఆగిపోవద్దు. వచ్చినవి చేసుకుంటూ వెళ్ళాలి. అన్నీ అయ్యాక మళ్ళీ మొదటి నుంచి వదిలేసినవి చూసుకుంటూ వెళ్ళాలి.
- ఎక్కువ ప్రశ్నలు సాల్వ్ చేసేయాలని అనుకోవద్దు. ఎన్ని కరెక్ట్‌గా చేస్తే ఎంత స్కోర్ వస్తుందో మీకు తెలుసు. అది మదిలో పెట్టుకుని పరీక్షలు ఏవైనా రాయాలని గుర్తుంచుకోవాలి. అదే సక్సెస్ రూట్.

ఎల్ఐసీ గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్

ముంబైలోని లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(ఎల్ఐసీ)- 'గోల్డెన్ జూబ్లీ స్కాలర్‌షిప్ స్కీమ్ 2023'కి దరఖాస్తులు కోరుతోంది. ప్రభుత్వ/ప్రైవేట్/ఐటీఐ కళాశాలలు సహా ఎన్‌సీవీటీ గుర్తింపు పొందిన ఇండస్ట్రియల్ ట్రెయినింగ్ సెంటర్లలో చదువుతున్న ప్రతిభావంతులకు ఆర్థిక సహకారాన్ని అందించేందుకు ఈ స్కీమ్‌ను ఉద్దేశించారు. ఇందులో జనరల్ స్కాలర్‌షిప్, స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ చైల్డ్ కేటగిరీలు ఉన్నాయి. అకడమిక్ మెరిట్, కుటుంబ వార్షికాదాయం ఆధారంగా అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

జనరల్ స్కాలర్‌షిప్

అర్హత: గుర్తింపు పొందిన రెగ్యులర్/ఒకేషనల్ కళాశాల నుంచి ఇంటర్/డిప్లొమా ఉత్తీర్ణులై ఉండాలి. పదోతరగతి స్థాయి నుంచి ప్రథమ శ్రేణి మార్కులు తప్పనిసరి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మెడిసిన్/ఇంజనీరింగ్/ఏదేని గ్రాడ్యుయేషన్/ఒకేషనల్/ఇంటిగ్రేటెడ్ కోర్సుల్లో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ అభ్యర్థులు; డిప్లొమా తరవాత ఇంజనీరింగ్ మొదటి సంవత్సర ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.

స్కాలర్‌షిప్: మెడిసిన్ చదివేవారికి కోర్సు పూర్తయ్యే వరకూ ఏడాదికి రూ.40,000లను మూడు విడతలుగా(రూ.12,000 + రూ.12,000 + రూ.16,000) చెల్లిస్తారు. ఇంజనీరింగ్ చదివేవారికి ఏడాదికి రూ.30,000(రూ.9,000 + రూ.9,000 + రూ.12,000)లు ఇస్తారు. జనరల్ డిగ్రీ, ఇంటిగ్రేటెడ్ కోర్సులు, ఒకేషనల్ కోర్సులు చేసేవారికి ఏడాదికి రూ.20,000 (రూ.6,000 + రూ.6,000 + రూ.8,000) ఇస్తారు.

- కోర్సుకు సంబంధించి వార్షిక పరీక్షల్లో కనీసం 55 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అవకాశం లభిస్తుంది



స్పెషల్ స్కాలర్‌షిప్ ఫర్ గర్ల్ చైల్డ్

- బాలికలకు చదువుపై ఆసక్తి కలిగించేందుకు, వారిని ఉన్నత విద్యలో ప్రోత్సహించేందుకు ఈ స్కాలర్‌షిప్ స్కీమ్‌ను రూపొందించారు.
- **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి ప్రథమ శ్రేణి మార్కులతో పదోతరగతి ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరంలో ఇంటర్/పన్నెండోతరగతి/డిప్లొమా/ఒకేషనల్/ఐటీఐ కోర్సుల్లో అడ్మిషన్ పొంది ఉండాలి.
- **స్కాలర్‌షిప్:** రెండేళ్ల పాటు ఏడాదికి రూ.15,000లను మూడు విడతలుగా (రూ. 4,500 + రూ.4,500 + రూ.6,000) ఇస్తారు.
- కోర్సుకు సంబంధించి మొదటి ఏడాది కనీసం 50 శాతం మార్కులు వస్తేనే స్కాలర్‌షిప్ రెన్యువల్‌కు అనుమతిస్తారు.

ముఖ్య సమాచారం

- కుటుంబ వార్షికాదాయం రూ.2,50,000 మించకూడదు.
- కరస్పాండెన్స్, పార్ట్ టైమ్, ఈవెనింగ్, డిస్టెన్స్, ఓపెన్ యూనివర్సిటీ, సెల్ఫ్ స్టడీ కోర్సులు చేసేవారు; సీఏ/సీఎ స్/ఐసీడబ్ల్యూఏ అభ్యర్థులు ఈ స్కీమ్‌నకు అనర్హులు.
- కుటుంబంలో ఒక విద్యార్థికి మాత్రమే అవకాశం కల్పిస్తారు. ఇద్దరు ఉన్న పక్షంలో ఒకరు బాలిక అయితే ఇద్దరికీ అవకాశం ఇస్తారు.
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** జనవరి 14
- **వెబ్‌సైట్:** https://licindia.in

నవ్య | చిత్రజ్యోతి

నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్ సైంధవ్

వెంకటేశ్



"నా సినీ కెరీర్‌లో 75వ చిత్రంగా 'సైంధవ్' లాంటి సినిమా చేయడం అదృష్టంగా భావిస్తున్నాను. ఇది నా కెరీర్‌లో బెస్ట్ ఫిల్మ్. న్యూ ఏజ్ యాక్షన్ థ్రిల్లర్ చేయాలని ఎప్పటి నుంచో ఉన్న కోరిక ఈ చిత్రంతో నెరవేరింది' అని వెంకటేశ్ అన్నారు. ఆయన కథానాయకుడిగా శైలేష్ కొలను దర్శకత్వం వహించిన చిత్రమిది. వెంకట్ బోయనపల్లి నిర్మాత. నవాజుద్దీన్ సిద్దిఖీ, ఆర్య, శ్రద్ధా శ్రీనాథ్, రుహానీ శర్మ, ఆండ్రియా జెరెమియా ప్రధాన తారాగణం. సంక్రాంతి సందర్భంగా జనవరి 13న 'సైంధవ్' విడుదలవుతోంది. బుధవారం చిత్రబృందం ట్రైలర్ విడుదల కార్యక్రమాన్ని నిర్వహించింది. ఈ సందర్భంగా వెంకటేశ్ మాట్లాడుతూ 'ఆకట్టుకునే భావోద్వేగాలతో పాటు అబ్బురపరిచే పోరాట ఘట్టాలు మా సినిమాకు ప్రత్యేక ఆకర్షణ. తప్పకుండా ప్రేక్షకులకు కొత్త తరహా అనుభూతిని ఇస్తుంది. ట్రైలర్ అద్భుతంగా వచ్చింది. సినిమా కూడా తప్పకుండా ప్రేక్షకులను అలరిస్తుంది. సంక్రాంతికి రిలీజ్ చేస్తున్నాం. ప్రేక్షకులు ఆదరించాలి' అని కోరారు. శైలేష్ కొలను మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి కెరీర్‌లో మైలురాయి లాంటి సినిమా చేసే అవకాశం నాకు వచ్చింది. ట్రైలర్‌లోనే కథ మొత్తం క్లుప్తంగా చెప్పానంటేనే సినిమాలో ఎంత విషయం ఉందో మీరే ఊహించుకోవచ్చు. ఇది నా బెస్ట్ ఫిల్మ్. వెంకీ 75వ చిత్రాన్ని గ్రాండ్‌గా సెలబ్రేట్ చేసుకోండి' అని చెప్పారు. వెంకట్ బోయనపల్లి మాట్లాడుతూ 'వెంకటేశ్ గారి లాంటి పెద్ద స్టార్‌తో సినిమా చేసే అవకాశం రావడం నా అదృష్టం. సినిమా విందు భోజనంలా ఉంటుంది' అని తెలిపారు.




ప్రముఖ సినీనటి ప్రభ కుమారుని పెళ్లి రిసెప్షన్ మంగళవారం సాయంత్రం హైదరాబాద్ గండిపేటలోని గోల్కొండ రిసార్ట్స్‌లో వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ఆంధ్రజ్యోతి పత్రికాధిపతి వేమూరి రాధాకృష్ణ హాజరై వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలందించారు. ఆయనతోపాటు సీనియర్ నటులు మురళీమోహన్‌ను కూడా ఈ చిత్రంలో చూడొచ్చు. మరుసటిరోజు బుధవారం ఉదయం గోల్కొండ రిసార్ట్స్‌లో రంగరంగవైభవంగా వివాహం జరిగింది. పలువురు ప్రముఖులు ఈ కార్యక్రమానికి హాజరై కొత్తదంపతులకు శుభాశీస్సులు అందించారు.

కింగ్‌ఖాన్‌కి కోపమొచ్చింది



షారుక్ రీసెంట్ హిట్ 'డంకీ' ప్రమోషన్‌లో భాగంగా అభిమానులతో నిర్వహించిన చిట్‌చాట్‌లో వారు అడిగిన ప్రశ్నలకు సరదాసరదాగా సమాధానాలిచ్చేశారు షారుక్. అయితే.. ఓ అభిమాని అత్యుత్సాహంతో అడిగిన ప్రశ్న షారుక్‌ని ఇరిటేట్ చేసింది. 'సార్.. అసలు 'డంకీ' బడ్జెట్ ఎంత? కొందరు 85 కోట్లు అంటున్నారు. కొందరు 120కోట్లు అంటున్నారు. ఇంకొందరేమో మీ రెమ్యునరేషన్ కలుపుకొని 350కోట్లు అంటున్నారు. అసలు నిజం మీ నోటి వెంట వినాలనుంది' అంటూ ఆ అభిమాని ప్రశ్నించగా షారుక్ ముఖ కవళికలు మారిపోయాయి. 'బ్రో.. ఆ విషయాలు నీకవసరమా? బిజినెస్ చేసేవాళ్లకు వదిలెయ్యాలి. ఆ గొడవలు వాళ్లు చూసుకుంటారు. ఉపయోగం లేని విషయాల గురించి ఆలోచించి ఎందుకు టైమ్ వేస్ట్ చేసుకుంటున్నావ్?' అంటూ సున్నితంగా ఆ అభిమానిని మందలించారు షారుక్.

చైనా గోడైనా దూకొచ్చు



నాగార్జున అక్కినేని కథానాయకుడిగా రూపొందుతున్న చిత్రం 'నా సామిరంగా'. ప్రముఖ కొరియోగ్రాఫర్ విజయ్ బిన్ని దర్శకత్వం వహిస్తున్నారు. రాజ్‌తరుణ్ కీలకపాత్రపోషిస్తున్నారు. బుధవారం చిత్ర బృందం రాజ్‌తరుణ్ పాత్రను పరిచయం చేస్తూ గ్లింప్స్ వదిలింది. ఈ చిత్రంలో ఆయన భాస్కర్ అనే కాలేజ్ స్టూడెంట్ పాత్రలో కనిపించనున్నారు. రుక్సార్ థిల్లాన్‌తో రాజ్‌తరుణ్ ప్రేమకథను గ్లింప్స్‌లో ఆవిష్కరించారు. 'తన చిరునవ్వు కోసం చైనా గోడైనా దూకొచ్చు' అంటూ ఆయన పలికిన సంభాషణలు ఆకట్టుకున్నాయి. జనవరి 14న విడుదలవుతున్న ఈ చిత్రంలో నాగార్జునకు జోడీగా ఆశికా రంగనాథ్ నటిస్తున్నారు. పవన్ కుమార్ సమర్పణలో శ్రీనివాసా చిట్టూరి నిర్మిస్తున్నారు. అల్లరి నరేశ్ కీలకపాత్రలో నటిస్తున్నారు. ఈ చిత్రానికి సంగీతం: ఎంఎం కీరవాణి. ప్రసన్న కుమార్ బెజవాడ కథ, మాటలు అందించారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర దాశరథి.




టైసన్ నాయుడు బరిలో దిగాడు



తొలి చిత్రం 'భీమ్లానాయక్'తోనే దర్శకుడిగా ఘన విజయం అందుకున్నారు సాగర్ కె. చంద్ర. ఇప్పుడు ఆయన బెల్లంకొండ సాయి శ్రీనివాస్ హీరోగా ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తున్నారు. యాక్షన్ ఎంటర్టైనర్‌గా రూపుదిద్దుకుంటున్న ఈ చిత్రాన్ని రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్నారు. సాయి శ్రీనివాస్ పుట్టిన రోజు సందర్భంగా బుధవారం చిత్రబృందం టైటిల్‌ను ప్రకటించి, గ్లింప్స్‌ను విడుదల చేసింది. ఈ చిత్రానికి 'టైసన్ నాయుడు' అనే పవర్‌ఫుల్ టైటిల్‌ను యూనిట్ ఖరారుచేసింది. బాక్సింగ్ దిగ్గజం మైక్ టైసన్ అభిమానిగా శ్రీనివాస్‌ను పరిచయం చేసిన గ్లింప్స్ ఆకట్టుకుంది. ఈ చిత్రంలో ఆయన డీఎస్పీ పాత్రలో అలరించనున్నారు. భీమ్స్ సిసిరోలియో ఈ చిత్రానికి సంగీతం అందిస్తున్నారు.

భక్తిభావంగా రామనామం



తేజ సజ్జ కథానాయకుడిగా ప్రశాంత్ వర్మ దర్శకత్వం వహించిన చిత్రం 'హను-మాన్'. సంక్రాంతి సందర్భంగా జనవరి 12న ప్రేక్షకుల ముందుకొస్తోంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు, పాటలు సినిమాపై అంచనాలను పెంచాయి. బుధవారం చిత్రబృందం 'శ్రీరామదూత స్తోత్రం' విడుదల చేసింది. భక్తిభావం ఉప్పొంగేలా గౌరహరి స్వరాలందించగా, సాయిచరణ్ భాస్కరుణి, లోకేశ్వర్ ఎడర, హర్షవర్ధన్ చావలి శ్రవణానందంగా ఆలపించారు. ఈ చిత్రంలో అమృత అయ్యర్ కథానాయిక. వరలక్ష్మీ శరత్‌కుమార్, వినయ్ రాయ్, గెటప్ శ్రీను, సత్య కీలకపాత్రలు పోషించారు. ప్రైమ్‌షో ఎంటర్టైన్‌మెంట్‌పై శ్రీమతి చైతన్య సమర్పణలో కె. నిరంజన్‌రెడ్డి ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: శివేంద్ర.

గ్రామీణ ప్రేమకథ ప్రారంభం

సీనియర్ నటుడు దేవరాజ్ తనయుడు ప్రణం దేవరాజ్ హీరోగా శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ బుధవారం ప్రారంభమైంది. ముహూర్తపు సన్నివేశానికి ఆకాష్ పూరి క్లాప్ ఇచ్చారు. దేవరాజ్ కెమెరా స్విచ్చాన్ చేశారు. తనికెళ్ల భరణి చిత్రబృందానికి స్క్రిప్ట్ అందించి, గౌరవ దర్శకత్వం వహించారు. ఈ సందర్భంగా దర్శకుడు



మాట్లాడుతూ 'నాకు ఇది తొలి చిత్రం. తెలుగు, కన్నడ భాషల్లో తెరకెక్కిస్తున్నాం. ఈనెలలోనే రెగ్యులర్ షూటింగ్ ప్రారంభిస్తాం' అన్నారు. దేవరాజ్ పాన్ ఇండియా హీరో, వాళ్ల బ్బాయి ప్రణం దేవరాజ్ కూడా ఈ రంగంలోకి వచ్చినందుకు ఆనందంగా ఉంది అని తనికెళ్ల భరణి చెప్పారు. ప్రణం దేవరాజ్ మాట్లాడుతూ 'ఇది తెలుగులో నాకు మూడో చిత్రం. మంచి లవ్ స్టోరీ, యాక్షన్ అంశాలతో రూపొందుతోంది' అని చెప్పారు. గ్రామీణ నేపథ్యంలో రూపొందుతున్న కుటుంబ కథా చిత్రమిదని నిర్మాత పి. హరికృష్ణ గౌడ్ తెలిపారు.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/jlEtdJ5 లో చదవండి.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

వైసీపీ పతనం ప్రారంభ మైంది

- మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, జనవరి 3 : రాష్ట్రంలో వైసీపీ పతనం ప్రారంభ మైందని, ఇక జగన్‌రెడ్డి ఎన్ని కుతంత్రాలు పన్నినా ఆ పార్టీ ఎన్నికల్లో తిరిగి గెలిచే అవకాశం లేదని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు స్పష్టంచేశారు. బుధవారం చిలకలూరిపేట పట్టణంలోని 6వ వార్డులో స్థానిక టీడీపీ శ్రేణులతో సమీక్ష నిర్వహించారు. ఈసందర్భంగా పుల్లారావు మాట్లాడుతూ.. బీటలు వారిన వైసీపీ సౌధం ఏ క్షణమైనా కుప్పకూలి పోవచ్చని, నివురుగప్పిన నిప్పులా ఉన్న ప్రభుత్వ వ్యతిరేకతను దారి మళ్ళించటానికి సీఎం జగన్‌రెడ్డి సిట్టింగ్‌లను మారుస్తూ హైడ్రామా నడిపిస్తున్నాడని, ఆయనేంచేసినా ప్రజలు మళ్ళీ వైసీపీని, జగన్‌ను నమ్మి ఓట్లేసే పరిస్థితి లేదన్నారు. వార్డుల వారి సమీక్షల్లో భాగంగా తొలి రోజు 2, 3, 6, 7, 8 వార్డు నాయకులతో మాట్లాడి వార్డులోని ప్రధాన సమస్యలను తెలుసుకున్నారు. భవిష్యత్తుకు గ్యారెంటీ, ఓటర్ల జాబితా పరిశీలన, పార్టీ కార్యక్రమాల నిర్వాహణ, నాయకుల పనితీరుపై చర్చించారు. రాష్ట్రంలో ఎన్నికలకు ఎంతో సమయం లేదని, పార్టీ నాయకులు, కార్యకర్తలు రానున్న మూడు నెలల్లో దూకుడుగా పని చేయాలని ప్రత్తిపాటి పుల్లారావు సూచించారు.

వైసీపీ కార్యాలయంపై రాళ్లదాడి కేసులో

మరో 9 మంది అరెస్ట్ .. విడుదల

గుంటూరు,జనవరి 3: గుంటూరు నగరంలోని లక్ష్మీపురం సాయిబాబారోడ్డు సెంటర్‌లో డిసెంబరు 31 అర్ధరాత్రి వైసీపీ కార్యాలయంపై రాళ్ళు రువ్విన కేసులో మరో 9 మందిని బుధవారం పట్టాభిపురం పోలీసులు అరెస్ట్ చేశారు. ఇదే కేసులో ఇప్పటికే సుమారు 25 మందిని సోమవారం అరెస్ట్ చేసిన విషయం విధితమే. తాజాగా మరోమ 9 మందిని అరెస్ట్ చేసి వారిని బెయిల్ పై విడుదల చేశారు. కేవలం ఒకరిద్దరు మాత్రమే రాళ్ళువిసిరితే సంబంధం లేని ఎంతో మందిని అక్రమంగా అరెస్ట్ చేస్తున్నారని ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, బాధితుల కుటుంబీకులు ఆరోపిస్తున్నారు.

గురుకుల విద్యాలయ సొసైటీలో

ఆయనో మోనార్క్!

- తాను చెప్పిందే వినాలి.. ఇతరుల సలహాలు పట్టించుకోరు.
- గురుకులాల్లో అంతర్గత సమస్యలపై ప్రిన్సిపాళ్ల గోడు



గుంటూరు కొరిటెపాడులోని గురుకుల సొసైటీ కార్యాలయం

గుంటూరు(విద్య),జనవరి 3: గురుకుల విద్యాలయ సొసైటీలో అంతర్గత సమస్యలు విద్యార్థులకు శాపాలుగా మారుతున్నాయి. ప్రిన్సిపాళ్ల చేసిన అనేకప్రతిపాదనలు అధికారుల నిర్లక్ష్యంతో ఆమోదానికి నోచుకోవడంలేదు. దీంతో కనీసం నిర్వహణ ఖర్చులు చెల్లించలేని పరిస్థితి ఏర్పడిందని ప్రిన్సిపాళ్ల ఆవేదనవ్యక్తం చేస్తున్నారు.

విద్యార్థుల వైద్య పరీక్షలకు గతి లేదు..

విద్యార్థులకు నెలకు ఒకసారి నిర్వహించే వైద్య పరీక్షలను కొంతకాలంగా చేయిండటంలేదని, కనీసం పీహెచ్‌సీ స్థాయి వైద్యుల చేతనైనా వైద్యపరీక్షలు నిర్వహించాలని తాము చేసిన విజ్ఞప్తిని సొసైటీలోని ఆ అధికారి పెడచెవిన పెడుతున్నారని ప్రిన్సిపాళ్ల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అలాగే లయన్స్‌క్లబ్, రోటరీ తదితర స్వచ్ఛంద సంస్థల వితరణ కార్యక్రమాలను సైతం అడ్డుకుంటున్నాడని ప్రిన్సిపాళ్లు వాపోయాతున్నారు. కనీసం విద్యాలయాల్లో ట్యూబ్‌లైట్లు, మోటార్ రిపేరు, అత్యవసరమైన భవనాల మరమ్మతుల గురించి ప్రిన్సిపాళ్లు ఎన్నిసార్లు ప్రతిపాదనలు చేసినా స్పందించడం లేదు. సొసైటీ ఆధ్వర్యంలో నిర్వహించే సమీక్షలు కూడా రహస్యంగా నిర్వహిస్తారనే ఆరోపణలు ఉన్నాయి.

ఇటీవల గుంటూరు నగరంలో గురుకుల విద్యాయాల సొసైటీ ఆధ్వర్యంలో మెరుగైన ఫలితాలు సాధించిన ప్రిన్సిపాళ్లకు సత్కార సభ నిర్వహించారు. ఈసమావేశంలో ఓ ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. 'ఆంధ్రజ్యోతిలో గురుకుల ఘోష'శీర్షికతో వచ్చిన కథనంపై చర్చ పెట్టారు. ఈ సందర్భంగా పత్రికలకు ఓ లేఖ ఇచ్చారని సిబ్బందిపై సదరు అధికారి అగ్గిమీద గుగ్గిలం అయ్యారు. ఈ సంఘటను మరో ప్రిన్సిపాల్ సెల్‌ఫోన్‌లో రికార్డు చేస్తున్న ఈ విషయం గమనించిన ఆయన హుటాహుటిన ఆ ప్రిన్సిపాల్ వద్దకు వచ్చి ఆయన సెల్ లాక్కుని నెలకేసి కొట్టారు. 'ఎంటీ తమాషాగా ఉందా?' అంటూ తీవ్రస్థాయిలో మండిపడ్డారు.

గురుకులాలు అద్భుతంగా ఉన్నాయంటూ సొంత కితాబు..

గురుకులాలు అన్ని అద్భుతంగా ఉన్నాయని, ప్రిన్సిపాళ్లు సిబ్బంది సమస్యలు సృష్టిస్తున్నారని సదరు అధికారి కితాబు ఇవ్వడంతో పాటు ప్రిన్సిపాళ్లపై తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో ఆ అధికారి ఏ విద్యాలయ పర్యటనలకు వెళ్ళిన దాఖలాలు దాదాపు లేవు. ఆ అధికారి ఏవరి మాటవినిపించుకోరు. చుట్టూ ఉన్న కోటరీలోని వ్యక్తుల మాట తప్పించి ఏవరి మాట వినరు అనే ప్రచారం సాగుతోంది. దీర్ఘకాలంగా పనిచేసే ఓ ద్వితీయశ్రేణి అధికారి చెప్పిందే వేదంగా భావిస్తారని సమాచారం. వాస్తంగా కార్యాలయాన్ని సచివాలయ సమీపానికి తరలించాల్సి ఉన్నా ఆ దిశగా చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇక్కడ అద్దె భవనంలోనే లక్షలు చెల్లిస్తూ కార్యాలయాన్ని నిర్వహిస్తున్నారు. ఇక్కడికి రావాలంటే ప్రిన్సిపాళ్లకు, ఇతర సిబ్బందికి అనదపు భారం తప్పడం లేదు. రెగ్యులర్, కాంట్రాక్టు ఉద్యోగులు సర్వీస్ విషయాల్లో ముడుపులు ఇచ్చుకోవాల్సిన దుస్థితి ఉందని ఆరోపణల ఉన్నాయి.

పేద,బడుగు బలహీనవర్గాల విద్యా ఉన్నతికి పాటు పడాల్సిన గురుకుల విద్యాలయాలు ఒకవైపు ప్రభుత్వ నిర్లక్ష్యంతో అస్తవ్యస్తంగా మారుతుంటే మరోవైపు ఉన్నత స్థాయిలో అధికారులు సమస్యల్ని మరింత జటిలం చేస్తున్నారు. గురుకుల విద్యాలయాల్లో పరిపాలనా పరమైన సమస్యల్ని పట్టించుకోకుండా తమ సొంత ఎజెండా అమలు చేస్తున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

సిటీ, ఎమ్మారై స్కాన్ యంత్రాలుకు సుస్తీ

- రోగులకు తప్పని అవస్థలు
- వ్యయ ప్రయాసలకోరి బయట సెంటర్‌లకు వెళుతున్న వైనం



ఎమ్మారైస్కాన్ పనిచేయకపోవడంతో గదులకు తాళాలు వేసి ఉన్న దృశ్యం

తెనాలిరూరల్, జనవరి 3: జిల్లాలోనే అతి పెద్ద రెండవ వైద్యశాలగా సేవలందిస్తున్న తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో రోగులకు వ్యాధి నిర్ధారణ చేసే సిటీస్కాన్, ఎమ్మారై వంటి పరికరాలు మొరాయించాయి. గత రెండేళ్లుగా సిటీస్కానర్ మరమ్మతులకు నోచుకోకపోగా తాజాగా ఎమ్మారై స్కాన్ కూడా మొరాయించింది. దీంతో అనారోగ్య సమస్యలతో వైద్యశాలకు వచ్చే రోగులకు వ్యాధి నిర్ధారణ చేసేందుకు అవసరమైన పరీక్షలు అందుబాటులో ఉండటం లేదు. తెనాలిలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు తెనాలి, దుగ్గిరాలు, కొల్లిపర, కొల్లూరు, చుండూరు, చేబ్రోలు, వేమూరు, అమర్తలూరు మండలాల నుంచి అధిక సంఖ్యలో రోగులు వైద్యసేవలకు వస్తుంటారు. ఇవే కాకుండా యాక్సిడెంట్, పాయిజన్ తీసుకున్న అత్యవసర కేసులు తరచుగా వస్తుంటాయి. అలాగే ఆర్థో విభాగంలోని రోగుల వ్యాధి నిర్ధారణ, శస్త్రచికిత్సల సందర్భంలో సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్‌ల అవసరం ఉంటుంది. ఐతే ఆస్పత్రిలో ఎమ్మారై, సిటీ స్కాన్ యంత్రాలు రెండు అందోబాటులో లేకపోవడంతో రోగులు బయటకు వెళ్లి చేయించుకోవల్సి వస్తుంది. కాగా ఈ పరీక్షలు ఎంతో ఖర్చుతో కూడుకున్నవి. అత్యవసర వైద్యం కోసం వచ్చే వారు ఆసుపత్రి నుంచి స్కానింగ్ సెంటర్లకు తరలించడం సాధ్యం కాకపోవడం, పైగా ఆయా స్కాన్ లకు ఖర్చు భరించలేక పోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఆసుపత్రి ఉన్నతాధికారులు వైద్యశాల్లోని రోగులకు సిటీ స్కాన్, ఎమ్మారై స్కాన్‌ల వంటి సేవలను అందుబాటులోకి తీసుకువచ్చి రోగులకు నాణ్యమైన వైద్యం అందించేలా కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

ఏసీబీ వలలో విద్యుత్ ఏఈ, లైన్‌మెన్


- రూ.45 వేలు లంచం తీసుకుంటూ చిక్కిన వైనం



అవినీతి అధికారులను పట్టించిన రైతు

రాజుపాలెం, జనవరి 3: ఓ రైతు పొలానికి విద్యుత్ కనెక్షన్ విషయంలో లంచం డిమాండ్ చేసిన విద్యుత్ శాఖలోని ఏఈ, ఓ ప్రైవేట్ లైన్‌మెన్‌ను బుధవారం ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. పల్నాడు జిల్లా రాజుపాలెం మండలంలోని ఉప్పలపాడు గ్రామానికి చెందిన రైతు సరికొండ వెంకటేశ్వర రాజు చుట్టు ప్రక్కల పొలాలకు చెందిన రైతులతో కలసి తన పొలంలో నూతన విద్యుత్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకున్నాడు. కనెక్షన్ మంజూరు చేయాలంటే రూ.50 వేలు నగదు ఇవ్వాలని విద్యుత్‌శాఖ అధికారులు డిమాండ్ చేశారు. తాము అంతమొత్తంలో ఇవ్వలేమని చెప్పినప్పటికీ వారు ఒప్పుకోలేదు. దీంతో బాధిత రైతు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. ఏసీబీ అధికారులు బుధవారం రంగంలోకిదిగి పథకం ప్రకారం సత్తెనపల్లి నుండి వస్తున్న విద్యుత్ శాఖ ఏఈ విజ్ఞాన ప్రసాద్, ప్రైవేటు లైన్‌మెన్ నూర్‌బాషా ఆదంషఫీలను రెడ్డిగూడెంలో లంచం తీసుకుంటుండగా పట్టుకున్నారు. వారిని రాజుపాలెంలోని విద్యుత్ శాఖ కార్యాలయానికి తీసుకువచ్చి విచారిస్తున్నారు. దాడుల్లో అడిషనల్ ఎస్పీ మహేంద్రమత్తె, డీఎస్పీ ప్రతాప్ సత్యానంద్, సీఐలు రవిబాబు, నరసింహారెడ్డి, అంజిబాబు, మన్మధరావు, సురేష్, నాగరాజు, ఎస్ఐ శ్రీనివాస్ మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



కౌలు రైతు యానాదిరావు (ఫైల్)

వేమూరు, జనవరి 3 : అప్పుల బాధతో కౌలు రైతు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని చావలి గ్రామంలో జరిగింది. గోపాలం యానాదిరావు అనే కౌలు రైతు 10 సంవత్సరాల నుంచి 7 ఎకరాల భూమిని కౌలుకు చేస్తూ ఉన్నాడు. వ్యవసాయ పెట్టుబడుల కోసం గతంలో రూ.10 లక్షల దాకా ఖర్చు చేసి నష్టపోయాడు. ఈ ఏడాది సాగుచేసినప్పటికీ ఇటీవల సంభవించిన తుఫానుకు చేతికి అంది వచ్చిన పంట పూర్తిగా దెబ్బతింది. పెరిగిన అప్పుల భారంతో మనోవేదనకు గురైన యానాదిరావు మంగళవారం రాత్రి పురుగు మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. కుటుంబ సభ్యులు వెంటనే ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. దీనిపై వేమూరు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

6న గుంటూరుకు ఉదయ్ ఎక్స్‌ప్రెస్

- అదేరోజు అమరావతి ఎక్స్‌ప్రెస్ నరసపూర్ వరకు పొడిగింపు
- జెండా ఊపి ప్రారంభించనున్న కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి
- గుంటూరు రైల్వేస్టేషన్‌లో వీడియో లింకు ద్వారా ఏర్పాట్లు
- జీఎం నుంచి డీఆర్ఎంకు ఆదేశాల జారీ

గుంటూరు, జనవరి3 (ఆంధ్రజ్యోతి): ఎన్నాళ్లగో ఎదురు చూస్తున్న విశాఖపట్టణం - గుంటూరు - విశాఖపట్టణం ఉదయ్ ఏసీ ఎక్స్‌ప్రెస్ ఈ నెల 6వ తేదీన గుంటూరు నుంచి రాకపోకలు సాగించనుంది. ఈ మేరకు దక్షిణ మధ్య రైల్వే జనరల్ మేనేజర్ నుంచి గుంటూరు డీఆర్ఎంకు ఆదేశాలు జారీ అయ్యాయి. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి శనివారం ఉదయం నరసపూర్ రైల్వేస్టేషన్‌లో ఈ రైలుని వీడియో రిమోట్ లింకు ద్వారా ప్రారంభిస్తారు. ఆ కార్యక్రమానికి సంబంధించి గుంటూరు రైల్వేస్టేషన్‌లో వీక్షించేందుకు విస్తృత ఏర్పాట్లు చేయాల్సిందిగా ఆదేశాలు జారీ అయ్యాయి. దీంతో గుంటూరు జిల్లా ప్రయాణీకులకు కొత్తగా ఏసీ డబుల్ డెక్కర్ లాంటి రైలు నిత్యం విశాఖపట్టణానికి అందుబాటులోకి రానుంది.

ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని తొలుత విశాఖపట్టణం-విజయవాడ- విశాఖపట్టణం మధ్యన నడిపేందుకు ఏర్పాటుచేశారు. ఆరైలుని గుంటూరు వరకు పొడిగించాలని ఎంపీలు గల్లా జయదేవ్, లావు శ్రీకృష్ణదేవరాయలు, ఆళ్ల అయోధ్య రామిరెడ్డి, మోపిదేవి వెంకట రమణలు పలుమార్లు రైల్వేబోర్డు, దక్షిణ మధ్య రైల్వే జీఎంకి విజ్ఞప్తి చేశారు. దాంతో ఏడాది క్రితమే ఉదయ్ ఎక్స్‌ప్రెస్‌ని గుంటూరుకు పొడిగిస్తూ రైల్వే శాఖ నిర్ణయం తీసుకోగా సాంకేతిక కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది. ఇప్పుడు ఎన్నికలు సమీపిస్తుండటంతో ఎట్టకేలకు ముహూర్తాన్ని ఖరారు చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి సమయం ఇవ్వడంతో ఈ నెల 6వ తేదీ శనివారం మధ్యాహ్నం 3 గంటలకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. దీని వలన ఉదయం విశాఖపట్టణం నుంచి గుంటూరుకు, సాయంత్రం గుంటూరు నుంచి విశాఖపట్టణానికి కొత్తరైలు అందుబాటులోకి వస్తుంది. ప్రస్తుతం గుంటూరు మీదగా నిత్యం రాత్రి వేళ విజయ వాడ - హుబ్లీ మధ్యన రాకపోకలు సాగిస్తున్న అమరావతి ఎక్స్‌ప్రెస్‌ని నరసపూర్ వరకు పొడిగించారు. పొడిగింపు కారణంగా ఈ రైలు వేగాన్ని కూడా పెంచారు. ప్రస్తుతం హుబ్లీ నుంచి గుంటూరుకు చేరుకొంటున్న సమయాన్ని దాదాపుగా గంట తగ్గించారు. ఈ రైలు ఉదయం 7.30 గంటలకు నరసపూర్ చేరుకొనేలా టైంటేబుల్ రూపొందించారు. నరసపూర్ నుంచి హుబ్లీకి వచ్చే రైలు విజయవాడ నుంచి పాత సమయపట్టికలోనే ప్రయాణిస్తుంది. ఈ రైలు వలన నరసపూర్‌కు చేరుకోవడానికి అదనపు సౌకర్యం ప్రయాణీకులకు అందుబాటులోకి వస్తుంది.

సమన్వయకర్తకూ.. సలాం

- నూతన సంవత్సరం రోజున వైసీపీ కార్యాలయానికి క్యూ కట్టిన పోలీసు శాఖ
- ఆ పార్టీ నేతలతో కలసి వేడుకల్లో పాల్గొన్న అధికారులు
- వైసీపీ సమన్వయకర్తతో కలసి కేక్ కటింగ్ ...



వైసీపీ కార్యాలయంలో బలసాని కిరణ్ కుమార్‌తో కలిసి కేక్ కట్ చేస్తున్న గుంటూరు సౌత్‌జోన్ డీఎస్పీ, ప్రత్తిపాడు, నల్లపాడు సీఐలు, ఎస్ఐలు

ప్రత్తిపాడు, జనవరి 3: ఆయన ఎమ్మెల్యే కాదు.. మంత్రి కాదు.. అధికారికంగా ఎలాంటి పదవులు లేవు.. కేవలం ఒక రాజకీయ పార్టీ తరుపున ప్రత్తిపాడు నియోజకవర్గ సమన్వయకర్త మాత్రమే. ఏ పదవి, హోదా లేని వ్యక్తికి నియోజకవర్గ పోలీస్ డిపార్ట్‌మెంట్ అధికారులంతా సలాం చేశారు. ఏకంగా పార్టీ కార్యాలయానికి అధికారికంగా వెళ్లి పుష్పగుచ్చాలు ఇచ్చి తమ స్వామి భక్తిని చాటుకున్నారు. డీఎస్పీ నుండి ఎస్ఐల వరకు అందరూ క్యూ కట్టారంటే ఈయన స్థాయి ఏమిటో... అంటూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలే విస్తుపోయారు. ప్రత్తిపాడు నియోజకవర్గానికి వైసీపీ సమన్వయకర్తగా బలసాని కిరణ్ నియమితులైనప్పటి నుంచి ఆయకు అన్ని శాఖల అధికారులు సలాం చేస్తూనే ఉన్నారు. తాజాగా నూతన సంవత్సరం సందర్భంగా వైసీపీ పార్టీ కార్యాలయంలో గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ, ప్రత్తిపాడు, నల్లపాడు సీఐలతో పాటు ప్రత్తిపాడు ఎస్ఐ మినహా అన్ని మండలాల ఎస్ఐలు బలసాని కిరణ్ కుమార్‌ను కలిసి పుష్పగుచ్చం, మొక్కలు అందజేసి ఆ తరువాత కేక్ కూడా కట్ చేసి వచ్చారు. త్వరలో జరగనున్న ఎన్నికల్లో ఒక రాజకీయ పార్టీ తరుపున పోటీచేసే అభ్యర్థి పట్ల పోలీసు శాఖ తమ స్వామి భక్తిని చూపించడం ప్రస్తుతం చర్చాంసనీయంగా మారంది. పోలీస్ అధికారులు వైసీపీ నేత బలసాని కిరణ్ కుమార్‌ను కలిసిన ఫోటోలు సోషన్ మీడియాలో వ్యాప్తి చెందుతున్నాయి.



బలసానికి పుష్పగుచ్చం అందజేస్తున్న గుంటూరు సౌత్ జోన్ డీఎస్పీ



తుళ్ళూరు రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు, రైతులు

స్వప్రయోజనాల కోసమే మూడు రాజధానులు

- రైతుల జీవితాలతో చెలగాటమాడుతున్న వైసీపీ ప్రభుత్వం
- 1478వ రోజుకు అమరావతి రైతుల ఆందోళనలు

తుళ్ళూరు జనవరి 3: రాష్ట్ర రాజధాని అమరావతి కోసం మాత్రమే మూడు పంటలు పంటలు పండే భూమిని తాము త్యాగం చేశామని, కానీ వైసీపీ ప్రభుత్వం మూడు రాజధానుల పేరిట తమ జీవితాలతో చెలగాటమాడుతుందని 33 వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు , రైతు కూలీలు చేస్తున్న ఆందోళనలు బుధవారం నాటికి 1478వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు రాజధానుల ప్రతిపాదన పాలకుల ప్రయోజనం కోసమన్నారు. ప్రభుత్వాలు మారినా.. రాష్ట్ర రాజధాని అమరావతి మారదన్నారు. కేంద్రం ప్రభుత్వం కూడా అమరావతే రాష్ట్ర ఏకైక రాజధాని పలు మార్లు స్పష్టం చేసిందన్నారు. జగన్‌రెడ్డి మూర్ఖంగా మూడు అంటూ రాష్ట్ర భవిషత్‌ని నాశనం చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ఉన్నత న్యాయ స్థానం తీర్పు ప్రకారం అమరావతి అభివృద్ధిని కొనాగించాలని మూడు రాజధానులకు వ్యతిరేకంగా రాజధాని ప్రాంత గ్రామాల్లో నిరసనలు తెలిపారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలగించి బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేశారు.

పింఛన్లలో మోసం చేసిన జగన్

- మాజీ ఎమ్మెల్యే యరపతినేని



పిడుగురాళ్ల, జనవరి3: అధికారంలోకి వచ్చిన వెంటనే రూ.3 వేలు పింఛన్‌ను ప్రతి ఒక్కరికి అందిస్తామని గొప్పలు చెప్పిన జగన్ నేడు అధికారంలోకి వచ్చాక ఐదేళ్లకు రూ.3 వేల పింఛన్ ఇస్తూ పింఛన్‌దారులను జగన్ మోసం చేశాడని మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో ఆరోపించారు. 1984లో రూ.35 ఎన్టీ రామారావు పింఛన్ పథకాన్ని ప్రారంభించగా 1997లో చంద్రబాబునాయుడు రూ.75లకు పెంచార న్నారు. కాంగ్రెస్ పదేళ్ల పాలనలో రూ. 125 పెంచి రూ.200 అందజేసిందని, ఆ తర్వాత చంద్రబాబునాయుడు రూ.1800 పెంచి రూ.2000 ఇచ్చాడని గుర్తుచేశారు. 2019 ఎన్నికలహామీలో చంద్రబాబు ఆయన సీఎం అయ్యాక మొదటి నుంచే రూ. 3 వేలు ఇస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. జగన్ మోసపూరిత హామీతో ప్రతి పింఛన్‌దారుడు ఈ ఐదేళ్లలో రూ.31 వేలకుపైగా నష్టపోయాడని తెలిపారు. మరోసారి జగన్‌ను నమ్మే పరిస్థితిలో పింఛన్ దారులు, రాష్ట్ర ప్రజలు లేరన్నారు. చంద్రబాబును గెలిపించుకొని వుంటే మొదటి నెల నుండే 3 వేల రూపాయలు పింఛన్ తీసుకొని వుండేవారమని, ఇప్పుడు బాధపడి ప్రయోజనం ఏమిటంటూ పింఛన్‌దారులు మదనపడు తున్నారని యరపతినేని తెలిపారు.

ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జన్

డాక్టర్ గురవారెడ్డికి పితృవియోగం



అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (ఫైల్)

హైదరాబాద్ సిటీ, జనవరి 3 (ఆంధ్రజ్యోతి) : కిమ్స్, సన్‌షైన్ ఎండీ, ప్రముఖ ఆర్థోపెడిక్ వైద్య నిపుణులు డాక్టర్ గురవారెడ్డి తండ్రి అన్నపరెడ్డి సత్యనారాయణ రెడ్డి (90) బుధవారం సాయంత్రం వృద్ధాప్యంతో మృతిచెందారు. 1933 లో తుమ్మల చెరువు, పల్నాడు గ్రామంలో జన్మించిన ఆయనకు రాజ్యలక్ష్మితో వివాహమైంది. కీటకాల శాస్త్రవేత్తగా పేరుగాంచారు. ఆయనకు ముగ్గురు కుమారులు గురవారెడ్డి, హరిప్రసాద్ రెడ్డి, నర్సింహారెడ్డి. చదువుకి అంకితంగా తన మరణానంతరం తన దేహాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడాలన్న తండ్రి కోరిక మేరకు ఉస్మానియా అస్పత్రికి మా తండ్రి దేహాన్ని ఇస్తున్నట్లు డాక్టర్ గురవారెడ్డి తెలిపారు. మా నాన్న గారే మా అందరికి ఆదర్శం. అందర్ని తారతమ్యం లేకుండా సమానంగా గౌరవించే మానవత్వాన్ని ఆయన దగ్గరనుంచే నేర్చుకున్నాం.

పిండ మార్పిడి విధానంలో

ఆవుదూడ జననం



పిండ మార్పిడి విధానం ద్వారా జన్మించిన దూడతో రైతు

క్రోసూరు, జనవరి 3 : పూర్తిస్థాయి స్వదేశీ పరిజ్ఞానంతో పిండమార్పిడి విధానం ద్వారా మేలు రకం ఆవు దూడను ఉత్పత్తి చేయటంలో క్రోసూరు పశు వైద్యాధికారులు విజయం సాధించారు. పశు సంవర్ధక శాఖ, శ్రీ వెంకటేశ్వర పశు విద్యాలయం సంయుక్త కార్యాచరణ ద్వారా ఈపిండ మార్పిడి ప్రక్రియ అమలు చేసినట్టు స్థానిక వైద్యులు తెలిపారు. మేలురకం దూడను హసానాబాద్ గ్రామానికి చెందిన శ్రీరామ్‌శెట్టి కృష్ణకు చెందిన నాటు ఆవు గర్భంలో గత సంవత్సరం మార్చి 1 ప్రవేశ పెట్టినట్లు తెలిపారు. ఆరోగ్య వంత మైన ఒంగోలు జాతి ఆవు దూడకు ఆవు జన్మనిచ్చినట్టు వారు తెలిపారు. పశు గణాభివృద్ధి సంస్థలో పని చేస్తున్న శ్రీమన్నారాయణ ఐవీఎఫ్ ద్వారా ఫల దీకరణ చెందిన పిండాన్ని అభివృద్ధి చేయటంలో ప్రధా న పాత్ర పోషించినట్టు తెలిపారు. లాంఫారంలో పని చేస్తున్న శ్రీకాంత్ సేవలు అందించారుఆవును ఎంపిక చేసి పిండాన్ని ఆవు గర్భంలోకి ప్రవేశ పెట్టడానికి స్థానికవైద్యులు సీహెచ్ మల్లయ్య కృషిచేశారు. లాం ఫారం ప్రధాన శాస్త్రవేత్త డాక్టర్ ముత్తారావు మార్గదర్శకం చేశారు. ఆవుదూడను ఉత్పత్తి చేయటం తాము సాధించిన విజయంగా స్థానిక పశు వైద్య బృందం తెలియజేశారు. ఈ ప్రయోగాన్ని స్థానికంగా మరికొన్ని ఆవుల్లో ప్రవేశ పెట్టి ఆవు దూడల ఉత్పత్తిని కొనసాగిస్తామని పశు వైద్యులు ఈ సందర్భంగా తెలిపారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.85
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	96, 104, 115
చికెన్ విత్ స్కిన్	186.00
చికెన్ స్కిన్ లెస్	196.00

57,983 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, జనవరి 3 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు బుధవారం 59,321 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 57,983 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఇంకా యార్డు ఆవరణలో 34,701 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	10000	22000
నెంబరు. 5	10400	17500
273	12300	17500
341	10000	18700
4884	14000	15500
సూపర్ 10	13000	13500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9000	23000
బ్యాడిగి	12000	23000
దేవనూరు డీలక్స్	10000	19000
తెల్లకాయలు	5000	14000

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
ఏసీ కామన్ వెరైటీ		
334	14000	21000
నెంబరు. 5	10500	15000
273	12000	12000
341	11000	18500
4884	–	–
సూపర్ 10	–	–
ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	9500	23000
బ్యాడిగి	12500	19500
దేవనూరు డీలక్స్	14000	14000
తెల్లకాయలు	7000	12000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు

ఉద్యోగుల గొంతు నొక్కుతున్న జగన్ ప్రభుత్వం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి బ్రహ్మారెడ్డి



రత్నమ్మ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బ్రహ్మారెడ్డి

రెంటచింతల, జనవరి 3 : అంగన్‌వాడీ, సమగ్రశిక్ష ఉద్యోగుల చేస్తున్న సమ్మె విఫలం చేయడానికి ప్రభుత్వం కుట్ర పన్ని ఈనెల 5 లోపు సమ్మె విరమించకపోతే చర్యలు తప్పవంటూ హెచ్చరించడం దేనికి సంకేతమని టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ప్రశ్నించారు. రెంటచింతలలో మృతి చెందిన మాజీ ఎంపీపీ చపారపు అంజమ్మరెడ్డి, మర్రి రత్నమ్మ, పాలువాయిలో మందపాటి ఎలమందారెడ్డి చిత్రపటాలకు బుధవారం పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓట్ల కోసం ఎన్నికల ముందు వాగ్ధానాలు చేసి ఇప్పుడు అమలు చేయలేక చేతులెత్తిసిన పాలక పక్షానికి రానున్న ఎన్నికల్లో గట్టిగా బుద్ధిచెప్పాలన్నారు. 125 మందికి చీరలు పంపిణీ చేశారు. సమావేశంలో టీడీపీ మండల అధ్యక్ష, ఉపాధ్యక్షులు అబ్బిరెడ్డి, ఎన్.శ్రీనివాసరావు, మండల పరిషత్ ఉపాధ్యక్షులు గొంటు సుమంత్‌రెడ్డి, కుర్రి శివారెడ్డి, మాజీ ఎంపీటీసీ మర్రి రాజ్‌కుమార్, టౌన్ అధ్యక్షులు రాజారెడ్డి, బోడపాటి రామకృష్ణ, ప్రభురాజు యాదవ్, చేర్రెడ్డి కృష్ణారెడ్డి, ట్రస్ట్ చైర్మన్ ఆనందకుమార్, అంతోని, మామిడి రవి, జ్ఞానయ్య, దానయ్య, బుజ్జి, అప్పయ్య, పంగులూరి పూర్ణయ్య, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ కృష్ణదేవరాయలును కలిసిన కేశానుపల్లి గ్రామస్థులు

దాచేపల్లి, జనవరి 3: ఫ్లైఓవర్ వద్దు....అండర్ పాస్ కావాలంటూ కేశానుపల్లి, దాచేపల్లి జంట గ్రామాలకు చెందిన బాధితులు బుధవారం ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు, కలెక్టర్ ఎల్.శివశంకర్‌లను కలిసి వినతిపత్రం అందజేశారు. ఫ్లైఓవర్ నిర్మాణంతో గృహాలను కోల్పోతామని, నిలువనీడ లేకుండాపోతుందని వారు ఎంపీకి వివరించారు. రైల్వే జీఎం, డీఆర్ఎంలకు గ్రామస్థుల సమస్యను తెలియజేసి ఇబ్బంది లేకుండా చూస్తామని ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు.

బీజేపీకి రాజీనామా చేసిన నవ కుమార్

దాచేపల్లి, జనవరి 3 : గురజాల నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ పదవికి రాజీనామా చేస్తున్నట్టు అంబటి నవ కుమార్ బుధవారం తెలిపారు. ఆయనతో పాటు దాచేపల్లి మండల బీజేపీ కన్వీనర్ ఎర్రమోతు ప్రభాకరరావు కూడా రాజీనామా చేసినట్టు తెలిపారు. తమ రాజీనామా పత్రాలను జిల్లా పార్టీ నాయకులకు అందజేశారు.

తక్కెళ్ళపాడులో యరపతినేని నిఖిల్ పర్యటన

దాచేపల్లి, జనవరి 3 : దాచేపల్లి మండలం తక్కెళ్ళపాడు గ్రామంలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తనయుడు యరపతినేని నిఖిల్ పర్యటించారు. గ్రామంలో పార్టీ నాయకులు, కార్యకర్తలతో పలు అంశాలపై చర్చించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన కలసి పని చేయటం ద్వారా నియోజక వర్గంలో మంచి మెజార్టీని సాధించ వచ్చని అభిప్రాయం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జంగిల్ వెంకటేష్, పార్టీ నాయకులు, హాజరయ్యారు.

టీడీపీ మినీ మేనిఫెస్టో ప్రజలకు వివరించాలి

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ



సమావేశంలో మాట్లాడుతున్న కన్నా లక్ష్మీనారాయణ

సత్తెనపల్లి, జనవరి 3 : బాబు ష్యూరిటీ, భవిష్యత్‌కు గ్యారెంటీ మినీ మేనిఫెస్టో పథకాల గురించి బూత్, యూనిట్ ఇన్‌చార్జ్‌లు ప్రజలకు వివరించాలని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. పట్టణంలోని రఘురామ్ నగర్‌లో బుధవారం టీడీపీ ప్రజా వేదికలో నకరికల్లు మండల బూత్ యూనిట్ ఇన్‌చార్జ్‌ల సమావేశం జరిగింది. కన్నా మాట్లాడుతూ ఓటర్ల నమోదుకు గడువు పెంచినందువల్ల అర్హులైన వారందరినీ ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను ఇంటింటికి తిరిగి ప్రజలకు తెలియజేయాలన్నారు. పార్టీ అభివృద్ధికి కృషి చేస్తున్న పలువురిని సన్మానించి జ్ఞాపికలు అందజేశారు. సమావేశంలో టీడీపీ నియోజకవర్గ నేత నాగోతు శౌరయ్య, నకరికల్లు మండల పార్టీ అధ్యక్షుడు నాదెండ్ల సత్యనారాయణ, టీడీపీ లీగల్ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఆలీ బాషా, క్లస్టర్ ఇన్‌చార్జ్ కే.వెంకట అప్పయ్య, మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడాలి : కన్నా

ముప్పాళ్ళ జనవరి 3 : వైసీపీ నాయకుల అరాచకాలకు చరమగీతం పాడేసమయం దగ్గరపడిందని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. మండలంలోని తొండపిలో పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు మండల టీడీపీ అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, గ్రామ టీడీపీ నాయకులు నలబోతు మాణిక్యరావు, బొద్దుల సుందరరావు ఆధ్వర్యంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. కన్నా మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి ప్రాధాన్యత కల్పిస్తానన్నారు. టీడీ పీలో చేరిన వారిలో ముజఫర్ బాజీ, బుడే, మాజీ ఎంపీటీసీ ఎస్‌కే బాబు, డి.బాజి, ఎస్‌కే సుభానీ, నిమ్మకాయల ఖాశిం, ఎస్‌కే బాజీ, షేక్ చింతపల్లి దరియా తదితరులు ఉన్నారు.

మున్సిపల్ కార్మికుల సమ్మెకు రాజకీయ పార్టీల సంఘీభావం

మాచర్ల, జనవరి 3 : పట్టణంలోని మండల రెవెన్యూ కార్యాలయం ఎదుట మున్సిపల్ కార్మికులు నిర్వహిస్తున్న సమ్మెకు రాష్ట్ర జేఏసీ పిలుపుమేరకు వివిధ కార్మిక సంఘాలు, పలు రాజకీయ పార్టీల నేతలు సంఘీభావం తెలిపారు. కార్మికులు న్యాయపరమైన డిమాండ్లను ప్రభుత్వం పరిష్కరించాలని, లేకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ రామచంద్రారెడ్డి, ఏఐటీయూసీ నేత మిద్దెపోగు బాబురావు, ఐఎన్‌టియూసీ నేత సత్యం, జనసేన నేత లాల్‌కృష్ణ, ఎమ్మార్పీఎస్ నేత రూబెన్ తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి, జనవరి 3 : తమ సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీ మునిసిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ సత్తెనపల్లి శాఖ ఆధ్వర్యంలో కాంట్రాక్ట్ ఔట్ సోర్సింగ్ కార్మికులు మునిసిపల్ కార్యాలయం వద్ద చేస్తున్న సమ్మె తొమ్మిదవ రోజుకు చేరుకుంది. సమ్మెలో పాల్గొన్న పారిశుధ్య కార్మికులు ఒంటి కాలిపై నిలబడి ప్రభుత్వంపై తమ నిరసనను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వీ చంద్రకళ, పెద వెంకయ్య, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

వేంకటేశ్వరస్వామి ఆలయానికి ధాన్యం వితరణ

బెల్లంకొండ, జనవరి 3 : బెల్లంకొండ మండలంలోని చంద్రాజుపాలెం గ్రామంలో గల వేంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవంలో అన్నదాన కార్యక్రమానికి 52 బస్తాల ధాన్యాన్ని వితరణ ఇచ్చినట్టు నరసరావుపేట పార్లమెంట్ బీసీ సంఘం ప్రధాన కార్యదర్శి ఓర్సు ఆనంద్ అన్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ పెద్దలు ఓర్సు లక్ష్మయ్య, ఓర్సు రాజేష్, బ్రహ్మయ్య, రాంబాబు, ఉప్పు సుబ్బారావు, వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు, కొండలు, జయ, నాగరాజు, వడ్డెర కులం సంఘం పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ నగర్‌లో వైద్య పరీక్షలు

సత్తెనపల్లి, జనవరి 3 : పట్టణంలోని అంబేద్కర్ నగర్ పాఠశాలలో 1, 31వ వార్డు ప్రజలకు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. మంత్రి అంబటి రాంబాబు జగనన్న ఆరోగ్య శిబిరాన్ని సందర్శించారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు పరికల్లు కోటేశ్వరరావు, మార్కెట్ యార్డు చైర్మన్ పెండెం బాబూరావు, డాక్టర్లు ఆసియా జెమీల్, జీ.ధర్మసింగ్ శాస్త్రి, అభిషేక్, సయ్యద్ పాల్గొన్నారు.

ఆటో, బైకు ఢీ : వ్యక్తి మృతి



సంఘటనా స్థలంలో కోటేశ్వరరావు మృతదేహం

మాచర్ల, జనవరి 3: ఆటో, బైకు ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో వ్యక్తి మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని కంభంపాడులో జరిగింది. కంభంపాడు గ్రామానికి చెందిన ఆటో మాచర్లలో సరుకులను లోడు చేసుకొని తిరిగి గ్రామానికి వెళ్తుండగా రెంటచింతలకు చెందిన తిక్కా కోటేశ్వరరావు (40) ద్విచక్ర వాహనంపై రెంటచింతల నుంచి మాచర్ల వైపు వస్తున్నారు. కంభంపాడు మెయిన్ సెంటర్ వద్దకు రాగానే ఆటో, బైకు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ సంఘటనలో కోటేశ్వరరావు అక్కడికక్కడే మృతి చెందాడు. మాచర్ల రూరల్ పోలీసులు సంఘటనా ప్రాంతానికి చేరుకొని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని మాచర్లలోని ప్రభుత్వ వైద్యశాలకు తరలించి కేసు నమోదు చేశారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మన్సూర్‌వలి (ఫైల్)

ముప్పాళ్ళ, జనవరి 3 : ముప్పాళ్ళలోని ఇండియన్ ఆయిల్ బంకు సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి చెందాడు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం ముప్పాళ్ళకు చెందిన షేక్ మన్సూర్‌వలి (40) పెట్రోల్ బంక్ సమీపంలో రోడ్డుపక్కన కూరగాయల కొట్టు పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. షాపు సమీపంలో రోడ్డుపక్కనే నిలబడి ఉన్న మన్సూర్‌వలిని సత్తెనపల్లి నుంచి నరసరావుపేట వైపు వేగంగా వెళుతున్న బొలేరో వాహనం ఢీకొంది. దీంతో మన్సూర్‌వలి తలకు, మరికొన్ని చోట్ల తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు నరసరావుపేటలోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. సంఘటనా స్థలాన్ని ముప్పాళ్ళ పోలీసులు పరిశీలించి, బొలేరో వాహనాన్ని పోలీసుస్టేషన్‌కు తరలించారు. డ్రైవర్ పోలీసుల అదుపులో ఉన్నట్లు సమాచారం.



బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమంలో పాల్గొన్న కొమ్మాలపాటి, వెన్నా తదితరులు

ఒక్క ఛాన్స్‌తో రాష్ట్రం నాశనం : కొమ్మాలపాటి

పెదకూరపాడు, జనవరి 3 : ఒక్క ఛాన్స్ ఇచ్చినందుకే రాష్ట్రాన్ని జగన్‌మోహన్ రెడ్డి నాశనం చేయగా మరో ఛాన్స్ ఇస్తే సర్వనాశనం చేస్తాడని మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ అన్నారు. మండలంలోని పొడపాడులో బుధవారం ఇంటింటికి కొమ్మాలపాటి కార్యక్రమాన్ని నిర్వహించారు. కొమ్మాలపాటి మాట్లాడుతూ రాష్ట్రంలో అన్ని రంగాల్లో పాలన గాడి తప్పిందని, పాలనను గాడిలో పెట్టాలంటే చంద్రబాబు నాయుడుకే సాధ్యమని, రానున్న ఎన్నికల్లో టీడీపీని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. టీడీపీ రాష్ట్ర నాయకుడు వెన్నా సాంబశివారెడ్డి మాట్లాడుతూ జగన్ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి అవలంభించిన ప్రజా వ్యతిరేక విధానాలను ప్రతి ఒక్కరు తెలుసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు అర్తిమళ్ళ రమేష్, మాజీ ఎంపీపీలు బెల్లంకొండ రామగోపాలరావు, గల్లా బాబూరావు, డిస్ట్రిబ్యూటరీ కమిటీ మాజీ చైర్మన్ వడ్లమూడి అప్పారావు, టీడీపీ జిల్లా నేతలు మద్దిరాల గంగాధర్, షేక్ ముంతాజ్, గంగినేని లీలావతి, ఏరువ బాలిరెడ్డి, మోదుగుల చంద్రశేఖర్, సర్పంచ్ కే.రూపలక్ష్మి హనుమంతరావు, మాజీ సర్పంచ్ షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ నబీ సాహెబ్, షేక్ హుస్సేన్, షేక్ మిలటరీ మౌలాలి, మాజీ సర్పంచ్ కఠారి శ్రీను, షేక్ సిద్ధిక్ పాల్గొన్నారు.

మునగోడులో వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

అమరావతి, జనవ రి 3 : మండల పరిధి లోని మునగోడులో ఎస్సీ కాలనీకి చెందిన సుమారు 100 కు టుంబాలకు చెందిన వైసీపీ సానుభూతి పరులు ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. పెదకూరపాడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ బుధవారం గ్రామంలో పర్యటించి వారికి పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. వైసీపీ ప్రభు త్వంలో అభివృద్ధి లేదని, దళితులపై దాడులు పెరిగాయని అందుకే తాము టీడీ పీలో చేరినట్లు వారు తెలిపారు. ముందుగా జూపూడి నుంచి మునగోడు టీడీపీ నాయకులు, కార్యకర్తలు బైక్ ర్యాలీ నిర్వహించి శ్రీధర్‌కు స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో ఎన్నారై మాగులూరి భానుప్రకాష్, గుంటూరు మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ వెన్నా సాంబశివారెడ్డి, వేగుంట రాణి, స్థానిక టీడీపీ నాయకులు డాక్టర్ షరీఫ్, సిహెచ్ సైదేశ్వరరావు, గణపా కోటిరెడ్డి, ఎం.శ్రీను, అబ్దుల్, గాలు, షెమి, సదాశివుడు, గుమ్మా మల్లికార్జునరావు, బంకా కోటేశ్వరరావు, ఎన్.బిక్షాలు, సిహెచ్ దావీదు, బంకా గురవయ్య, సీహెచ్ ప్రవీణ్, కస్తాల ఏసోబు, ఎం.వెంకటేశ్వర్లుతో పాటు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ఎస్ఈబీ అధికారుల దాడులు

గురజాలటౌన్, జనవరి 3: ఎస్ఈబీ స్టేషన్ పరిధిలోని నడికుడి, దైద గ్రామాల్లో బుధవారం ఎస్ఈబీ అధికారులు దాడులు నిర్వహించారు. నడికుడిలో 10, దైదలో 8 బాటిళ్ల అక్రమ మద్యం గుర్తించారు. మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకొని ఇరువురిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్ఐ జయరావు తెలిపారు.

సావిత్రిభాయి పూలేకు ఘన నివాళి



సావిత్రిబాయి పూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జంగా కృష్ణమూర్తి తదితరులు

పిడుగురాళ్ల, జనవరి 3: దేశంలో మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే నేటి ఉపాధ్యాయ వర్గాలకు ఆదర్శప్రాయమని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి అన్నారు. పిడుగురాళ్లలోని జంగా కృష్ణమూర్తి పార్టీ కార్యాలయంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి జంగా పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. జడ్పీటీసీ జంగా వెంకట కోటయ్య, వైసీపీ నాయకులు కట్టా వెంకటేశ్వరరెడ్డి, మద్దాళి సుబ్బయ్య, శానంపూడి వెంకటేశ్వరరెడ్డి, కొక్కెర కొండలు, షేక్ షరీఫ్, భూషణం చెన్నయ్య, గద్దల వేదమణి, పలువురు వైసీపీ, బీసీ నాయకులు ఉన్నారు. పట్టణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు యడవల్లి కొండలు ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి నిర్వహించారు. గురజాల నియోజకవర్గ బిసి సంక్షేమ సంఘం అధ్యక్షులు కొక్కెర కొండలు, ప్రధాన కార్యదర్శి దూదేకుల ఖాశింసైదా, బీసీ రాష్ట్ర నాయకులు కంభంపాటి రాము, దూదేకుల సలీం, గిరి, సైదా, ఆరిఫ్, కర్పూరపు కోటేశ్వరరావు, జమ్మిశెట్టి రామకృష్ణ, నడికోట సత్యనారాయణ, తదితరులు పాల్గొని సావిత్రిబాయి సేవలు కొనియాడారు.

● మాచర్ల రూరల్, జనవరి 3: పట్టణంలోని ఓబీసీ మహిళా సంఘ కార్యాలయంలో బుధవారం ఓబీసీ సంఘ జాతీయ అధ్యక్షుడు వరప్రసాద్ పాల్గొని సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మహిళా సంఘ అధ్యక్షురాలు గంజర్ల ఆదిలక్ష్మి, హరిత, ఎస్‌కే మస్తాన్, తురకా అంజమ్మ, బత్తుల విజయ, నాగమ్మ తదితరులు పాల్గొన్నారు.

● సత్తెనపల్లి, జనవరి 3 : పట్టణంలోని వెంగళరెడ్డినగర్‌లో గల ప్రాథమిక పాఠశాలలో బుధవారం బీసీ సంఘాల ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో వేముల కొండయ్య, చింతా అంకమరావు, పత్తిపాటి హరేకృష్ణ, పిక్కిలి శివ, గుంజి విజయ్, షరీఫ్, కంటు వెంకట్రామయ్య, గుంటూరు గోవిందు, రిబక, శివ జ్యోతి, కే.విజయ కుమార్ తదితరులు పాల్గొన్నారు. జైభీమ్ భారత్ పార్టీ అధ్యక్షుడు జొన్నలగడ్డ విజయ కుమార్ ఆధ్వర్యంలో కూడా సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించారు.

● క్రోసూరు, జనవరి 3 : మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ కాంద్రు కాశయ్య గృహంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుద్దుల యోహాన్, మాజీ ఎంపీపీ వెంకట రామిరెడ్డి, టీడీపీ మైనార్టీ నాయకులు షేక్ హసన్, క్రోసూరు మాజీ వైస్ చైర్మన్ ముస్తఫా, కొమ్మినేని సతీష్ పాల్గొన్నారు.

● అచ్చంపేట, జనవరి 3 : అచ్చంపేటలోని టీడీపీ కార్యాలయంలో పార్టీ మండల అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం తిరువాయిపాటి అంజనేయులు, బత్తుల శ్రీనివాసరావు, తాళ్ళూరి సుబ్బారావు, వెనిగండ్ల కోటయ్య, షేక్ కాసుల, తాళ్ళూరి రాంబాబు, పుసులూరి ఏడుకొండలు, షేక్ యాకోవలి, జ్యోతి కిరణ్, పోసిపోగు సామేలు పాల్గొన్నారు. అంబేద్కర్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వ ర్యంలో సావిత్రి బాయి పూలే జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ చిలుకా చంద్రయ్య, తిరువాయిపాటి అంజనేయులు, శిఖా నరసింహారావు, గోవిందు, కస్తాల ప్రసాదు పాల్గొన్నారు.

● రెంటచింతల, జనవరి 3 : సంఘసంస్కర్త, ఉపాధ్యాయిని, రచయిత్రి సావిత్రిభాయి పూలే జయంతిని మహిళా దినోత్సవంగా జరుపుకుంటూ బుధవారం పలువురు టీచర్లను ఘనంగా సన్మానించారు. మంచికల్లు గ్రామంలోని ఎంపీయుపీ పాఠశాల హెచ్‌ఎం వసంతకుమారిని ఘనంగా సత్కరించారు.ఈ కార్యక్రమంలో టీచర్లు శిలార్ అహ్మద్,వెంకటేశ్వర్లు,రమణారెడ్డి,భాస్కర్,జానీ పాల్గొన్నారు.

● దాచేపల్లి, జనవరి 3 : నారాయణపురంలోని టీడీపీ కార్యాలయంలో సావిత్రిభాయి పూలే చిత్రపటానికి టీడీపీ జాతీయ క్రమశిక్షణా కమిటీ సభ్యుడు గుంటుపల్లి నాగేశ్వరరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో డాక్టర్ కర్నాటి వరలక్ష్మి, బెల్లంకొండ భద్రి, నర్రా పుల్లయ్య, తంగెళ్ల శ్రీనివాసరావు, జనసేన నాయకులు అంబటి మల్లి, ముళ్ళం శ్రీనివాసరావు, బొమ్మిరెడ్డి నారాయణ, వేముల తిరుమలకుమార్, మాజీ ఎంపీటీసీ వలి, కూరాకుల నాగేశ్వరరావు, తుల్లా తదితరులున్నారు.

●పెదకూరపాడు, జనవరి 3 : సంఘ సంస్కర్త, ఉత్తమ ఉపాధ్యాయిని సావిత్రి బాయి పూలే అని పెదకూరపాడు జడ్పీ పాఠశాల ప్రధానోధ్యాయులు కేవీ రమణ అన్నారు. స్థానిక జడ్పీ హైస్కూల్‌లో బుధవారం సావిత్రి బాయి పూలే జయంతిని నిర్వహించారు.

పింఛన్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే శంకరరావు

బెల్లంకొండ, జనవరి 3 : మండలంలోని వన్నాయపాలెం, చంద్రాజుపాలెం గ్రామాల్లో బుధవారం రూ.3 వేలకు పెంచిన పెన్షన్‌లను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు ఇంటింటికి తిరిగి లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ చెన్నపరెడ్డి పద్మ వెంకటేశ్వరరెడ్డి, జడ్పీటీసీ వెంకటరెడ్డి, సర్పంచ్ శివయ్య, వైస్ సర్పంచ్ వెంకటేశ్వర్లు, మిల్లు వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● క్రోసూరు, జనవరి 3 : సత్తెమ్మతల్లి దేవస్థానం క్యాలెండర్‌ను ఎమ్మెల్యే నంబూరు శంకరరావు బుధవారం క్రోసూరులోని నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పలువురు దేవాదాయ శాఖ అధికారులు, పాలక వర్గ చైర్మన్‌తో పాటు సభ్యులు పాల్గొన్నారు.

పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

సమ్మెపై ప్రభుత్వ స్పందన ఏది..?

● మున్సిపల్ కార్మికుల సమ్మెపై డాక్టర్ అరవిందబాబు

నరరావుపేట టౌన్, జనవరి 3: మున్సిపల్ కార్మికులు సమ్మె చేస్తుంటే ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేదని టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు విమర్శించారు. బుధవారం టీడీపీ నియోజకవర్గ కార్యాలయంలో అరవిందబాబు మాట్లాడుతూ న్యాయమైన కోర్కెలు తీర్చమని మున్సిపల్ కార్మికులు అడుగుతున్నారని అన్నారు. ఎమ్మెల్యే కనీసం పారిశుధ్య కార్మికులను పరామర్శించడగాని, పలకరించడం గాని చేయలేదన్నారు. దీంతో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులు ధర్నా చేయడం జరిగిందన్నారు. అక్కడ ఉన్న మున్సిపల్ కార్మికుల మీద లాఠీచార్జి చేసి, మహిళలపై దౌర్జన్యం చేశారన్నారు. ఎమ్మెల్యే గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి వేలుచూపిస్తూ బెదిరిస్తున్నారని, ఇదే కార్మికులు ఓట్లువేసి గెలిపించారన్న విషయం గుర్తుంచుకోవాలన్నారు. రానున్న రోజులలో ఏఐటీయూసీ, సీఐటీయూ నాయకులపై కేసులు పెట్టిస్తాడని ఆరోపించారు. ఎందుకంటే టీడీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజా సంఘాల నాయకుల మీద కేసులు పెట్టించిన ఘనత ఎమ్మెల్యేకి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డికి ప్రజలు బుద్ధి చెబుతారని హెచ్చరించారు. సమావేశంలో మాజీ ఎంపీపీ కడియం కోటిసుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

నరసరావుపేటలో పారిశుధ్య పనులు చేసిన ఎమ్మెల్యే


రోడ్లను ఊడుస్తున్న ఎమ్మెల్యే

నరసరావుపేట రూరల్, జనవరి 3: నరసరావుపేటలో పారిశుధ్య కార్మికులు సమ్మె నేపథ్యంలో ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి చీపురు చేతపట్టి రోడ్లను ఊడ్చారు. పల్నాడు రోడ్డు, రామిరెడ్డిపేట, అరండల్‌పేట, మోర్‌సెంటరు తదితర పరిసరాల్లో పార్టీ కార్యకర్తలతో కలసి చీపురుపట్టి రోడ్లను శుభ్రంచేశారు. కార్మికులు చేపట్టిన సమ్మెతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని కార్మికులు మానవతా దృక్పథంతో ఆలోచించాలన్నారు.

అంగన్‌వాడీల కలెక్టరేట్ ముట్టడి విజయవంతం

నరసరావుపేట టౌన్, జనవరి 3: అంగన్‌వాడీల సమస్యల పరిష్కారం కోసం బుధవారం అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కలెక్టరేట్ ముట్టడి కార్యక్రమం విజయవంతం అయింది. ధర్నాకు జిల్లా వ్యాప్తంగా అంగన్‌వాడీలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. అంగన్‌వాడీలు ఈ నెల 5లోపు విధులలో చేరకపోతే చర్యలు తీసుకుంటామనే బెదిరింపులకు భయపడేది లేదని, సమస్యలు పరిష్కారం అయ్యేవరకు పోరాటం కొనసాగిస్తామని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కేపీ మెటిల్డాదేవి అన్నారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కాసా రాంబాబు, శ్రామిక మహిళ సమాఖ్య కన్వీనర్ డి.శివకుమారి, పీడీఎం నాయకులు నల్లపాటి రామారావు, కంబాల ఏడుకొండలు, శోభరాణి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ.10 లక్షలు విరాళం

వినుకొండ, జనవరి 3: కొండపై ఉన్న రామలింగేశ్వరస్వామి దేవస్థానం నిర్మాణంకోసం పట్టణంలోని పూజిత డాల్ మిల్లు యజమాని చందోలు మల్లికార్జునరావు బ్రదర్స్ 10లక్షల 116 రూపాయలను ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు సమక్షంలో పట్టణాభివృద్ధి సేవా సంఘం సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా చందోలు మల్లికార్జునరావు కుటుంబసభ్యులు ఎమ్మెల్యే బొల్లా అభినందించి సన్మానించారు. అదేవిధంగా పల్నాడు రోడ్డులోని లక్ష్మీవెంకటశ్రీనివాసట్రేడర్స్ మేనేజింగ్ పార్టనర్స్ కోట రమేష్, కట్టమూరి శ్రీనివాసరావులు రూ.2,01,116లను సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా వారిని అభినందించారు.

ఎన్ఎస్‌పీ కాలువ కట్టలపై అక్రమంగా నిర్మాణాలు

వినుకొండ టౌన్, జనవరి 3: పట్టణంలోని విష్ణుకుండినగర్ సమీపంలోని పెరుమాళ్లపల్లి మేజర్ కాలువ కట్టపై అక్రమ ఇంటి నిర్మాణాలను అఖిలపక్షపార్టీ నాయకులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఎన్ఎస్‌పీ చప్టా వద్ద కాలువకట్ట స్థలాన్ని ఆక్రమించుకొని ఓ బడా వ్యాపారి అక్రమంగా షాపులను నిర్మిస్తున్నారని, మున్సిపల్ అధికారులు నేటికీ పట్టించుకున్న దాఖలాలు లేవని తెలిపారు. ఎన్ఎస్‌పీ స్థలంలో ఎటువంటి అనుమతి లేకుండా జరుగుతున్న అక్రమ నిర్మాణాలను వెంటనే నిలిపివేసి స్థల ఆక్రమణదారులపై సంబంధిత అధికారులు చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

హోంగార్డుల ఐకమత్యం అభినందనీయం: ఎస్పీ రవిశంకరరెడ్డి

నరసరావుపేట లీగల్, జనవరి 3: హోంగార్డుల ఐకమత్యం అభినందనీయమని పల్నాడు జిల్లా ఎస్పీ వై రవి శంకర్‌రెడ్డి అన్నారు. పదవీ విరమణ పొందిన తెనాలికి చెందిన హోంగార్డు కేవీఎస్ నాగేశ్వరరావుకు బుధవారం ఎస్పీ కార్యాలయంలో సాటి హోంగార్డుల ఒక రోజు వేతనం రూ.5,19,720 ఆర్థికసాయాన్ని చెక్కు రూపంలో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలోని హోంగార్డులందరూ ఒకరోజు వేతనాన్ని సాయం చేశారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ వై రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

పెన్షనర్లకు ప్రభుత్వం వేలకోట్ల బకాయిలు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, పక్కన యూటీఎఫ్ నాయకులు ప్రేమ్‌కుమార్, జీ విజయసారధి తదితరులు

ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు

నరసరావుపేట టౌన్, జన వరి 3: రాష్ట్ర ప్రభుత్వం ఉపాధ్యాయులు, ఉద్యోగులు, పెన్షనర్లకు రూ.16 వేల నుంచి రూ.18 వేల కోట్లు బకాయిలు ఉందని ఎంఎల్‌సీ కేఎస్ లక్ష్మణరావు అన్నారు. బుధవారం 1వ తేదీన జీతాలు, పీఆర్‌సీ, డీఏలు, పీఎఫ్, ఏపీజీఎల్ఐ తదితర ఆర్థిక బకాయిల సాధనకై యూటీఎఫ్ పోరుబాట కార్యక్రమం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలో నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఎల్‌సీ లక్ష్మణరావు మాట్లాడుతూ గత మూడు, నాలుగేళ్ళుగా ఎటువంటి బకాయిలు ప్రభుత్వం చెల్లించలేదన్నారు. 11వ వేతనం సంఘం సిపార్సులకు సంబంధించి బకాయిలు ఇంతవరకు చెల్లించలేదన్నారు. డీఏల సక్రమ నిర్వహణ జరగలేదని, వాటి బకాయిలు కూడా చెల్లించలేదన్నారు. సరెండర్ లీవులు సంబంధించిన బకాయిలు చెల్లించలేదని చెప్పారు. అన్నిటికంటే విచిత్రం ప్రావిడెంట్ ఫండ్ ఉపాధ్యాయులు, ఉద్యోగులు దాచుకున్న పీఎఫ్‌కు సంబంధించి పెళ్లిల కోసం, గృహ నిర్మాణం కోసం దరఖాస్తు చేస్తే అవి కూడా సంవత్సరాలు తరబడి రానటువంటి పరిస్థితి ఉందన్నారు. ఏపీజీఎల్ఐ, పీఎఫ్ బకాయిలు ఏవీకూడా చెల్లించటం లేదని అన్నారు. ఆర్థిక మంత్రి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శితో చర్చించినప్పుడు కొద్దికాలంలో చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. కానీ హామీలు హామీలుగానే ఉండిపోయాయన్నారు. ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కాబోతుందని, ఇంతవరకు బకాయిలు చెల్లించలేదని, ఆర్థిక మంత్రితో మాట్లాడినప్పుడు కూడా మేము ఏమి చేయలేమని ఆయన మాట్లాడారని అన్నారు. దీంతో యూటీఎఫ్ దీని మీద చొరవ తీసుకొని రాష్ట్రవ్యాప్తంగా ధర్నా నిర్వహిస్తుందన్నారు. ఇప్పటికి ప్రభుత్వం స్పందించకపోతే జనవరి 9, 10 తేదీలలో విజయవాడలో రాష్ట్ర స్థాయిలో 36 గంటల ధర్నా నిర్వహిస్తామన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించాలని డిమాండ్ చేశారు. పోరుబాట కార్యక్రమానికి కౌలురైతు సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వై రాధాకృష్ణమూర్తి, రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఏపూరి గోపాలరావు, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు కే హనుమంతరెడ్డి, ఎస్ ఆంజనేయనాయక్, కేవీపీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి పీ రవి బాబు, శ్రామిక మహిళ సమాఖ్య జిల్లా కన్వీనర్ డీ శివకుమారి, బీ హనుమంతరావు, ఏ లక్ష్మీశ్వరరెడ్డి సంఘీబావం తెలియజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ పల్నాడు జిల్లా అధ్యక్షుడు పీ ప్రేమ్‌కుమార్, ప్రధాన కార్యదర్శి జీ విజయసారధి, సహాధ్యక్షుడు మద్దుకూరి మోహనరావు, కోశాధికారి జే వాల్యానాయక్, ఆర్ ఆజేయ్‌కుమార్, వీ నాగేశ్వరరావు, సీహెచ్ శ్రీనివాసరావు, ఏ శ్రీనివాసరావు, ఆయేషా సుల్తానా, నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా సావిత్రిబాయి జయంతి

నరసరావుపేట రూరల్, జనవరి 3: పట్టణంలోని గిరిజన గురుకుల బాలికా విద్యాలయంలో బుధవారం భారతీయ మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 193వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కలెక్టర్ శివశంకర్ లోతేటి పాల్గొని సావిత్రీబాయి పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భారతదేశ అభివృద్ధికి సావిత్రీబాయి చేసిన సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో జిల్లా విద్యాగిరిజన సంక్షేమ అధికారి లోతేటి వరలక్ష్మి, వి.కోటానాయక్, ఈ.గోపిచంద్, ఎం.కుమారి తదితరులు పాల్గొన్నారు.

● చిలకలూరిపేట: పట్టణంలో వివిధ సంఘాలు, పార్టీల ఆధ్వర్యంలో సావిత్రి బాయి పూలే జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గడియార స్తంభం వద్ద ఉన్న జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే కాంస్య విగ్రహాలకు బీసీ సంక్షేమ సంఘం నాయకులు మద్దుల వెంకట కోటయ్య, జ్యోతిరావు పూలే చైతన్య సేవా సంఘం అధ్యక్షుడు ఉప్పాల భాస్కరరావు, కస్తూరి వెంకటేశ్వర్లు, ఎం శ్రీనివాసరావు తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● మందా కృష్ణ మాదిగ నాయకత్వంలో నిర్వహించిన మరొక కార్యక్రమంలో మరొక కార్యక్రమంలో అద్దంకి బాబు మాదిగ, కే క్రాంతి కుమార్ మాదిగ, విజయ సాగర్ మాదిగ తదితరులు జ్యోతిరావు పూలే, సావిత్రి బాయి పూలే విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

● తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బీసీ సెల్ అధ్యక్షులు తన్నీరు పుల్లారావు అధ్యక్షతన సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మద్దిబోయిన శివ, భీమవరపు సుబ్బారావు, తన్నీరు పుల్లారావు, చింతకాయల కోటేశ్వరరావు, మనోహర్ తదితరులు పాల్గొన్నారు.

● యడ్లపాడు: యడ్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎంఈవో నాగరత్నం సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో హెచ్ఎం విజయభారతి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులో అగ్ని ప్రమాదం

నరసరావుపేట లీగల్, జనవరి 3: పట్టణ శివారు బైపాస్ రోడ్డులో పట్టణంలోని చెత్తమొత్తం విచక్షణా రహితంగా వేయటంతో సరైన నిర్వహణ లేక అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. చలికాలం కావటంతో మంచుకు తోడు పొగతోడై అటుగా వెళ్ళే వాహనదారులు పలు ఇబ్బందులకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలికి వెళ్ళి మంటలను అదుపులోకి తెచ్చారు.

బంగారుతల్లి పథకం ప్రారంభం

నరసరావుపేట లీగల్, జనవరి 3: పట్టణంలోని ప్రాంతీయ ప్రభుత్వ వైద్యశాలలో జిల్లా కలెక్టర్ ఎల్ శివ శంకర్‌తో కలిసి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి బంగారు తల్లి పథకాన్ని ప్రారంభించారు. బుధవారం నుంచి జిల్లాలో ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్టు వారు తెలిపారు. తొలుత బాలింతలు అప్పుడే పుట్టిన బిడ్డలతో కేక్‌ను కట్ చేసిపెట్టారు. ఆడ పిల్లలకు గుర్తింపు కార్డును తల్లికి ఇచ్చారు. కార్యక్రమాన్ని గ్రామీణ ప్రాంతాల్లో మంగళ, బుధవారం, పట్టణ ప్రాంతాల్లో గురు, శుక్రవారం ప్రత్యేకంగా ప్రభుత్వ ఆస్పత్రి సిబ్బంది చేపట్టనున్నట్టు జిల్లా కలెక్టర్ తెలిపారు. జిల్లాలో మహిళా వివక్షత నిర్మూలించటం కోసమే ఈ కార్యక్రమం చేపట్టినట్టు ఆయన తెలిపారు. కార్యక్రమంలో హుడా చైర్మన్ మిట్టపల్లి రమేష్, డీసీహెచ్‌వో డాక్టర్ జీ రంగారావు, స్థానిక వైద్యులు, ఆరోగ్య శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

20న కోర్టు ఆవరణలో వేలం

నరసరావుపేట లీగల్, జనవరి 3: వివిధ కేసుల్లో స్వాధీనం చేసుకున్న సెల్‌ఫోన్‌లు, హార్డ్‌డిస్క్‌లు, కంప్యూటర్ మానిటర్లను ఈ నెల 20వ తేదీ ఉదయం 10:30గంటల నుంచి 11 గంటల మధ్య బహిరంగ వేలం వేయనున్నట్టు మొదటి అదనపు జూనియర్ సివిల్ న్యాయాధికారి ప్రవలిక ఓ ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు స్థానిక న్యాయవాద సంఘానికి సమాచారం అందించారు. ఆసక్తి గల వారు కోర్టు పని దినాల్లో సదరు వస్తువులను పరిశీలించుకోవచ్చన్నారు. పాటదారులు పాడుకున్న వెంటనే పూర్తి పైకం చెల్లించాలని, ధ్రువీకరణ పత్రంతో పాడుకున్న వారికి సదరు వస్తువులను అందజేస్తామని తెలిపారు.

నష్టపరిహారం కోసం ప్రతిపాదనలు పంపించాం: డీఏవో మురళి

వేల్పూరు (శావల్యాపురం) జనవరి 3: కుచౌంగ్ తుఫాన్ ప్రభావం వలన పల్నాడు జిల్లా వ్యాప్తంగా 33శాతం కంటే ఎక్కువగా దెబ్బతిన్న పంటలను లెక్కించి నష్టపోయిన రైతులకు రూ.2.81కోట్లు పంట నష్టపరిహారం అందించాలని ప్రభుత్వానికి నివేదిక పంపినట్లు జిల్లా వ్యవసాయ శాఖాధికారి ఇంగిరాల మురళి అన్నారు. మండలంలోని వేల్పూరులోని రైతుభరోసా కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా 10వేల హెక్టార్లలో శనగ, 867హెక్టార్లలో వరి, 183హెక్టార్లలో మొక్కజొన్న, 211హెక్టార్లలో మినుము, 322హెక్టార్లలో కంది, 566హెక్టార్లలో పొగాకు పంటలు దెబ్బతిన్నాయన్నారు. రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ ద్వారా 2.81కోట్లు పంట నష్టపరిహారం చెల్లించాల్సి ఉందన్నారు. శనగకు పంట నష్టపరిహారం వర్తించదని, రైతులు పొలాల్లో తిరిగి సాగు చేసుకొనేందుకు 10వేల క్వింటాళ్ళ శనగ విత్తనాలను 80శాతం రాయితీపై అందించడం జరిగిందన్నారు. హార్టికల్చర్ డీడీవో బోస్నీ, ఏడీఏ బోయపాటి రవిబాబు, ఎంఏవో పల్లపోతు ప్రవీణ్, రామినేని రామారావు, ఏఈవో పూరేటి అశోక పాల్గొన్నారు.


వేల్పూరులో కోల్డ్‌స్టోరేజీ ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ కృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు తదితరులు

కోల్డ్‌స్టోరేజీ, మల్టీపర్పస్ గోడౌన్ ప్రారంభం

వేల్పూరు (శావల్యాపురం) జనవరి 3: నాబార్డు సహకారంతో శావల్యాపురం సహకార సంఘం ఆధ్వర్యంలో మండలంలోని వేల్పూరులో రూ.8కోట్లతో నూతనంగా నిర్మించిన కోల్డ్‌స్టోరేజీ, మల్టీపర్పస్ గోడౌన్‌ల ప్రారంభోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథులుగా వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ లావుశ్రీకృష్ణదేవరాయలు, ఎమ్మెల్యేలు బొల్లా బ్రహ్మనాయుడు, నంబూరి శంకర్రావు, జీడీసీసీ బ్యాంక్ చైర్మన్ రాతంశెట్టి సీతారామాంజనేయులు పాల్గొన్నారు. అనంతరం మంత్రి గోవర్ధన్‌రెడ్డి, ఎంపీ శ్రీకృష్ణదేవరాయలును దుశ్శాలువాలతో ఘనంగా సత్కరించారు. మంత్రి గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ వ్యవసాయ సహకార పరపతి సంఘాల ద్వారా దేశంలోనే మొట్టమెదటి కోల్డ్‌స్టోరేజీని వేల్పూరులో నిర్మించడంపై హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాబార్డు సీజీఎం గోపాల్, జీఎం ప్రసాద్, డీడీఎం శరత్‌బాబు, ఆప్కాబ్ రాష్ట్ర చైర్మన్ ఝాన్సీరాణి, జిల్లా సొసైటీ బ్యాంక్ సీఈవో కృష్ణవేణి, డైరెక్టర్లు గోవిందనాయక్, ఆంజనేయులు, హరిబాబు, శావల్యాపురం సొసైటీ చైర్మన్ నాగులపాటి చెన్నయ్య, ఎంపీపీ ముండ్లమూరి సుహాసిని అనిల్‌కుమార్, డీఏవో మురళి, ఏడీఏ రవిబాబు, హార్టికల్చర్ బీటీవో బిన్నె తదితరులు పాల్గొన్నారు.

రక్షణ కోరిన వారిపై బైండోవర్ కేసులా?: ప్రత్తిపాటి

నాదెండ్ల, జనవరి 3: వైసీపీ వర్గీయులు దాడిచేస్తే రక్షణ కోరిన పాపానికి తెలుగు యువత నాయకులు ఖాజా మొహిద్దీన్‌పై బైండోవర్ కేసులు పెట్టడం ఏపీ పోలీసులకే చెల్లిందని మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మంగళవారం రాత్రి ఖాజా మొహిద్దీన్‌పై వైసీపీ వర్గీయులు దాడికి యత్నించారు. ఈ విషయం తెలుసుకున్న పుల్లారావు అతన్ని బుధవారం పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో దళితులు, గిరిజనులు, మైనార్టీలకు రక్షణ లేదనటానికి ఈ ఘటన ఒక ఉదాహరణ అన్నారు. జగన్ పాలనలో బాధితులనే నిందితులుగా చేస్తున్న పరిస్థితులు నెలకొన్నాయని ఆయన విమర్శించారు.

మునిసిపల్ కార్మికుల సమ్మె ప్రారంభం

చిలకలూరిపేట, జనవరి 3: ఏఐటీయూసీ అనుబంధ మునిసిపల్ వర్కర్స్ యూనియన్ చిలకలూరిపేట శాఖ ఆధ్వర్యంలో బుధవారం మునిసిపల్ కార్మికులు సమ్మె ప్రారంభించారు. స్థానిక సీపీఐ కార్యాలయం నుంచి పట్టణంలోని ప్రధాన వీధుల గుండా భారీ ర్యాలీ నిర్వహించారు. తెల్లవారు జాము నుంచి సుమారు మూడు వందల మంది కార్మికులు ఈ సమ్మెలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీపీఐ ఏరియా కార్యదర్శి నాగబైరు రామసుబ్బాయమ్మ మాట్లాడుతూ మునిసిపల్ కార్మికుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న సిబ్బంది న్యాయమైన సమస్యలను తక్షణం పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నాయకులు కే.చెంచయ్య, యోగయ్య, పేలూరి రామారావు, దాసరి వరహాలు, మునిసిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులు ఆవుల పోతురాజు, పెద్ద నాగేశ్వరరావు, ఏపీ మహిళా సమాఖ్య ఏరియా కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

చిలకలూరిపేట, జనవరి 3: చిలకలూరిపేట టౌన్-2 పరిధిలోని పురుషోత్తమపట్నంలోని అడ్డరోడ్డు సెంటర్, బైపాస్ రోడ్డు సెంటర్, పెద్ద మసీదు సెంటర్లలో విద్యుత్ లైన్‌ల మరమ్మతుల కారణంగా గురువారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్టు విద్యుత్‌శాఖ డీఈఈ ఆర్ అశోక్ కుమార్ బుధవారం తెలిపారు. వినియోగదారులు విషయాన్ని గమనించి సహకరించాలని కోరారు.

పసుమర్రులో ఇల్లు దగ్ధం: నలుగురికి గాయాలు

చిలకలూరిపేట, జనవరి 3: చిలకలూరిపేట మండలం పసుమర్రు గ్రామంలో ఎస్సీ కాలనీలో బుధవారం తెల్లవారు జామున జరిగిన అగ్ని ప్రమాదంలో ఒక గృహం పూర్తిగా కాలిపోయి ఒకే కుటుంబానికి చెందిన నలుగురు గాయపడ్డారు. ప్రమాదంలో గృహంతో పాటు గృహంలోని సామగ్రి పూర్తిగా కాలిపోయింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ప్రమాదం జరిగిందని భావిస్తున్నారు. సంద్ర రత్నరాజు, కుమారి, సంజయ్, శ్రీవిద్య ప్రమాదంలో గాయపడి స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. అగ్నిమాపక సిబ్బంది వచ్చి మంటలను ఆర్పివేశారు. కాగా అగ్ని బాధితులను మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావు సందర్శించి వారికి ధైర్యం చెప్పారు. తెలుగుదేశం పార్టీ వారికి అండగా ఉంటుందని తెలిపారు. వైసీపీ నియోజకవర్గ సమన్వయకర్త మల్లెల రాజేష్ నాయుడు ఆస్పత్రికి వెళ్ళి బాధితులను పరామర్శించారు. బాధితులకు అండగా ఉంటామని పేర్కొన్నారు. నియోజకవర్గ జనసేన పార్టీ ఇన్‌చార్జ్ తోట రాజా రమేష్ అగ్ని బాధితులకు వైద్య ఖర్చుల నిమిత్తం పార్టీ తరుపున రూ.20వేలు ఆర్థికసాయం అందజేశారు. ఈ సంఘటనపై విద్యుత్‌శాఖ అధికారులు పూర్తిస్థాయిలో విచారణ జరిపి ఆ కుటుంబానికి తక్షణం నష్టపరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని విద్యుత్ శాఖ ఏడీఈ కార్యాలయంలో కన్స్యూమర్స్ రైట్స్ ప్రొటెక్షన్ ఫోరం నాయకులు మురికిపూడి ప్రసాదు, రవినాయక్, విక్రమ్ వినతి పత్రం అందజేశారు.

పొగాకు బేరన్ దగ్ధం... రూ.3 లక్షల ఆస్తి నష్టం

నూజెండ్ల, జనవరి 3: మండలంలోని కొండలరాయునిపాలెంలో పొగాకు బ్యారన్ దగ్ధమై మూడు లక్షల ఆస్తి నష్టం సంభవించిన సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన మాదాల రాఘవులు తన పొలంలో సాగుచేసిన పొగాకును బ్యారెన్‌లో వేడిచేస్తున్న సమయంలో బ్యారెన్‌లోని అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. విషయం తెలుసుకున్న వినుకొండ అగ్నిమాపక దళం వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. పొగాకు బ్యారెన్ దగ్ధమవ్వటంతో తనకు పెద్ద మొత్తంలో ఆస్తి నష్టం సంభవించినట్టు రాఘవులు పేర్కొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

వినుకొండ టౌన్, జనవరి 3: గత నెల 28వ తేదీన పట్టణంలోని ముండ్లమూరు డౌన్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని ప్రభుత్వ వైద్యశాలలోని మార్చురీలో భద్రపరిచినట్లు ఎస్ఐ లక్ష్మీప్రసాద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మృతుడి శరీరంపై కాషాయవస్త్రాలు, తెల్లటి వస్త్రాలు ఉన్నాడని, సుమారు 60 సంవత్సరాల పైన వయసు ఉండవచ్చని తెలిపారు. ఆచూకీ తెలిసినవారు వినుకొండ సీఐ 9440796248, ఎస్ఐ 8247852205 సంప్రదించాలన్నారు.

అక్రమ మద్యం కేసులో నిందితుల అరెస్టు

నరసరావుపేట లీగల్, జనవరి 3: అక్రమంగా మద్యం సీసాలను కలిగిన ఉన్న కేసులో నిందితుడైన నాదెండ్ల మండలం సాతులూరు గ్రామానికి చెందిన షేక్ సైదులును బుధవారం అరెస్టు చేసినట్టు నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఎస్ఐ కే.సురేంద్రబాబు తెలిపారు. బుధవారం సాయంత్రం పట్టణ శివారు గుంటూరు రోడ్డులోని భారత్ పెట్రోలియం బంకువద్ద నిందితుడిని దాడిచేసి అరెస్టు చేశామన్నారు. నిందితుడి వద్ద నుంచి 46మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు.